ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం
వార్త
బుధవారం 23, సెప్టెంబర్ 2026 16 పేజీలు




# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వెలుగుమట్ల కాలనీని ఆదర్శ కాలనీగా అభివృద్ధి చేయాలి

ఖమ్మం కలెక్టరేట్ సెప్టెంబర్ 22: (ప్రభాతవార్త)

16వ పేజీలో...





# మరీ ఇంత బరితెగింపా?




## జ్యుయలరీ యజమానుల "రీప్లెడ్జింగ్"

పేటలో హద్దులు మీరిన ప్రైవేటు బ్యాంకులు

నిబంధనలకు నిప్పుపెట్టి పసిడి రుణాలు

తాకట్టు పెట్టేవాడి అర్హతేమిటో చూడకుండా మంజూరీలు

వస్తు రుణానికి 50 గ్రాముల పరిమితి ఉన్నది

బయటి పాన్‌బ్రోకర్లతో అక్రమ వ్యాపారం

నష్టపోతున్న సామాన్య ప్రజలు

నియంత్రించాల్సిన అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారు

రూ.లక్షల్లో నెలవారీ మామూళ్లు అందుతున్నట్లు ఆరోపణలు

ఇంత రాద్ధాతం జరుగుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన కరవు

అశ్వారావుపేట/అశ్వారావుపేట రూరల్/ప్రభాతవార్త

అశ్వారావుపేట పట్టణంలో గడచిన నాల్గురోజులుగా బంగారం తాకట్టు కుంభకోణం కార్చిచ్చులా రగులుకుంటున్నా..ఈ వ్యవహారానికి సంబంధించిన నియంత్రణా విభాగం నిమ్మకు నీరెత్తినట్లుగా కునుకు తీస్తున్నది. ఒకటా రెండా ఏకంగా రూ.10కోట్ల విలువైన పసిడి వస్తువులను వాటి అసలు యజమానులు కాకుండా.,ఎవరో సంబంధంలేని దళారీలు ఇక్కడి కొన్ని ప్రైవేటు "నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థల్లో(ఎన్‌బిఎఫ్‌సిఎస్)" తాకట్టు పెట్టడం., ఒరిజినల్ యజమాని రూ.లక్ష తెచ్చిమ్మంటే.,దళారీనేమో దానికి రెండుమూడింతల అదనంగా తాకట్టు సొమ్ములు కాజేయడం., దీంతోపాటే కొందరు పాన్‌బ్రోకర్లు.,అలానే జ్యుయలరీస్ షాపుల వాళ్ళూ తమ కస్టమర్ల గోల్డ్‌ని సయితం ఇదే బ్రోకర్ల ద్వారా




2వ పేజీలో...

# చేతబడి పేరుతో వృద్ధురాలిపై దాడి

సుమోటోగా కేసు నమోదు చేసిన పోలీసులు

బూర్గంపహాడ్, ప్రభాతవార్త:

బూర్గంపహాడ్ మండల పరిధిలోని జింకలగూడెం గ్రామంలో చేతబడి పేరుతో వృద్ధురాలిపై దాడి చేసిన ఘటనపై బూర్గంపహాడ్ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో ఆధారంగా పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. గ్రామానికి చెందిన ఎస్‌కే షకీనా బీ అనే వృద్ధురాలు



2లో...

# గంజాయి రవాణాపై ఉక్కుపాదం

జిల్లాలో 2,190 కిలోల గంజాయి సీజ్.. 219 మంది అరెస్ట్

విలువ రూ.11.20 కోట్లు..

మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట నిఘా

డీఆర్వో పద్మావతి

కొత్తగూడెం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాను అరికట్టేందుకు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని డీఆర్వో పద్మావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీలో నిర్వహించిన జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నివారణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 2,190.63 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోగా, దాని విలువ రూ.11,20,81,500గా అధికారులు తెలిపారు. ఈ కేసుల్లో 219 మందిని అరెస్టు చేయగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.

2లో...

# బతికుండగానే చంపేశారు..?

**ఇల్లందు, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** ఇల్లందు పట్టణంలో ఓ వ్యక్తి బతికుండగానే మరణించినట్లు చూపిస్తూ నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం పొందినట్లు వస్తున్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఆ ధ్రువీకరణ పత్రాన్ని ఆధారంగా చేసుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గిఫ్ట్ డీడ్ పేరుతో ఆస్తుల రిజిస్ట్రేషన్ చేయడం, అనంతరం అదే పత్రాలతో మున్సిపాలిటీలో మ్యుటేషన్ కూడా పూర్తి చేయించినట్లు ఆరోపణలు రావడం అధికార వ్యవస్థ పనితీరుపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ ఘటన వెలుగులోకి రావడంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.




### నకిలీ పత్రాలకు అధికారుల సంతకాలా?

ఈ వ్యవహారంలో అవసరమైన పలు ధ్రువపత్రాలను మార్ఫింగ్ చేసినట్లు, వాటిపై అటెస్టెడ్ సంతకాలు కూడా పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ శాఖకు చెందిన ఓ అధికారి సంతకం ఈ పత్రాలపై ఉండటం అనుమానాలకు తావిస్తోంది. సంబంధిత పత్రాలు నిజమైనవా, నకిలీవా అన్న విషయాన్ని ధృవీకరించాల్సిన అధికారులు కనీస పరిశీలన 2లో

నకిలీ సర్టిఫికెట్లతో మున్సిపాలిటీలో మ్యుటేషన్

ఈ నకిలీ సర్టిఫికెట్లకై వ్యవసాయ అధికారి అటెస్టెడ్ సంతకం

అవసరమైన పలు దృవపత్రాలు మార్ఫింగ్

నకిలీ సర్టిఫికెట్లతో దర్జాగా రిజిస్ట్రేషన్

మామూళ్ల మత్తులో అధికారులు ధ్రువీకరణ పత్రాలు మంజూరు

ఆలస్యంగా వెలుగు చూసిన బాగోతం

లబోదిబో మంటున్న బాధితుడు

బాధితుడికి న్యాయం చేసేందుకు పలువురు రహస్య చర్చలు

ఈ నకిలీ వ్యవహారంలో లక్షలు చేతులు మారినట్లు విశ్వసనీయ సమాచారం

ఈ వ్యవహారం అంతా ఓ దళారి ఆధ్వర్యంలో

# స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

## విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పరిశుభ్రతపై బాధ్యత పెంపొందించాలి

### సర్పంచ్ మందా నాగరాజు



**బూర్గంపహాడ్, ప్రభాతవార్త:**
విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే స్వచ్ఛత, పరిశుభ్రతపై అవగాహన కల్పించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యతను పెంపొందిం చాలని బూర్గంపహాడ్ గ్రామపంచాయతీ సర్పంచ్ మందా నాగరాజు అన్నారు. మంగళవారం బూర్గంపహాడ్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పాఠశాలలు కేవలం విద్యను అందించే కేంద్రాలే కాకుండా, విద్యార్థుల్లో మంచి అలవాట్లు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను పెంపొందించే వేదికలని అన్నారు. ప్రతి విద్యార్థి తన ఇంటి పరిసరాలతో పాటు పాఠశాల, గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్తబుట్టలను వినియోగిం చాలని, పరిశుభ్రతను రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో మొక్కల పెంపకం ఎంతో ముఖ్యమని పేర్కొన్న ఆయన.. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. మొక్కలు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తాయని చెప్పారు. విద్యార్థులు ఇప్పటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్‌లో సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వచ్ఛతపై చేసిన ప్రసంగాలను సర్పంచ్ అభినందించారు. శ్రీ సరస్వతీ శిశు మందిర్ వంటి విద్యాసంస్థలు మరిన్ని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ పాఠశాలపై తనకు ప్రత్యేకమైన అభిమానం ఉందని, పాఠశాల నుంచి ఆహ్వానం అందిన ప్రతిసారీ కార్యక్రమాలకు హాజరై తనవంతు సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. పాఠశాలకు అవసరమైన సహాయాన్ని గ్రామపంచాయతీ తరఫున అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు, కమిటీ సభ్యురాలు శ్రీమతి గౌరీ మాధవి, ఆచార్య బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



## స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి

### జడ్పీ సీఈవో నాగలక్ష్మి

**బూర్గంపహాడ్, ప్రభాతవార్త:**
పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని జడ్పీ సీఈవో నాగలక్ష్మి అన్నారు. మంగళవారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని మోరంపల్లి బంజర గ్రామపంచాయతీ లోని మండల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా–2026 కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా డస్ట్‌బిన్‌లను వినియోగించాలని సూచించారు. వైద్య, శానిటరీ వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. పరిశుభ్రమైన పరిసరాలతోనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకుని, తమ ఇళ్లలోనూ, పాఠశాలలోనూ స్వచ్ఛతను పాటించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమలా రెడ్డి, ఎంపీఓ రామకృష్ణ, సర్పంచ్ బొర్రా సుభద్ర, ఉపసర్పంచ్ పొక్కుల రవి, పంచాయతీ కార్యదర్శి భవాని, వార్డు సభ్యుడు పుల్లారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శిరోమణి, ఉపాధ్యాయులు రేవతి, రామారావు, గ్రామ పెద్దలు నర్సి రెడ్డి పాల్గొన్నారు.

## కాటాయిగూడెం గ్రామంలో భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



**దుమ్ముగూడెం: ప్రభాతవార్త (సెప్టెంబర్ 22)**
దుమ్ముగూడెం మండలం కాటాయిగూడెం గ్రామంలో గణపతి నవరాత్రుల్లో 9 వ రోజు కార్యక్రమంలో భాగంగా మంగళవారం గణపతి హోమాన్ని మూలామంత్రాలతో అర్చకుడు దుడ్ల రాఘవ శర్మ హోమాన్ని నిర్వహించారు వేద మంత్రోచ్ఛారణల నడుమ గణపతి హోమాన్ని భక్తిశ్రద్ధ లతో నిర్వహించారు ఈ హోమం వలన గ్రామానికి పాడి పంటలు పశు శిశు రక్షణార్థం అఖండ ధన ధాన్యవృద్ధి గ్రామాభివృద్ధి చేకూరుతుందని వేద పండితుడు తెలిపాడు ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కోడి వెంకటేశ్వర రావు రమాదేవి దంపతులు కొరసా రమేష్ నాగమణి దంపతులు కరెళ్ళ వీరభద్రరావు జానకమ్మ దంపతులు కల్లూరి భద్రయ్య ముత్తమ్మ దంపతులు కల్లూరి సత్తిబాబు దుర్గ దంపతులు కోడి అంజయ్య సరోజినీ సవలం రాజు ఆదెమ్మ కోడి కృష్ణ మధు కోర్స కృష్ణ రోజా, కమిటీ మెంబర్స్ గ్రామస్తులు పాల్గొన్నారు

## పాఠశాల నిధులు వినియోగంపై సమావేశం




**దుమ్ముగూడెం: ప్రభాతవార్త (సెప్టెంబర్ 22)**
దుమ్ముగూడెం మండల పరిధిలోని నరసాపురం గ్రామంలో ఉన్న రైతు వేదిక వద్ద పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం ఎంఈఓ సున్నం సమ్మయ్య అధ్యక్షతన మంగళవారం జరిగింది ఈ సమావేశంలో ఇటీవల దుమ్ముగూడెం మండలంలోని పాఠశాలలకు 20 లక్షల 90 వేల రూపాయల నిధులు జమ అయ్యాయి ఈ నిధులు వినియోగం రికార్డుల నమోదు బిల్లులు సమర్పణ తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్ ఏజే ప్రభాకర్ వివరించారు ఎస్ టి ఓ కు సమర్పించాల్సిన బిల్లులు ఏ విధంగా తయారు చేయాలనే అంశాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు రాష్ట్ర , జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానంనరసాపురం రైతు వేదిక వద్ద జరిగిన పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం అనంతరం ఇటీవల రాష్ట్రస్థాయి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన ఉపాధ్యాయులను ఎంఈఓ సున్నం సమ్మయ్య పలువురు పాఠశాలల హెచ్‌ఎంలు సన్మానించారు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడుగా ప్రభుత్వం చే అవార్డు పొందిన దుమ్ముగూడెం మండలం సింగవరం గ్రామపంచాయతీలోనున్న పెదపాడు ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు మళ్ల మోహన్ కుమార్ ను జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన వి వసంతరావును శాలువాతో సన్మానించి అభినందించారు అలాగే జెడ్ వీరభద్రపురం పాఠశాలకు చెందిన హెచ్‌ఎం మంగవేణికి శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో కవిత కిరీటి బిరుదును ప్రధానం చేయడంతో ఆమెను కూడా శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పలువురు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## తెలుగు భాషపై ఐటీడీఏ పీవో ప్రత్యేక దృష్టి

### పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న గిరిజన విద్యార్థులు

**భద్రాచలం, సెప్టెంబరు 22(ప్రభాతవార్త):**
తెలుగు భాషపై విద్యార్థుల్లో పట్టు పెంచేందుకు ఐటీడీఏ పీవో బి.రాహుల్ ప్రత్యేక దృష్టి సారించారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గిరిజన భవన్‌లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. కవితలు, పద్యాలు, శీర్షికలు, ఒక నిమిషం తెలుగు ప్రసంగం, ఏకపాత్రాభినయం, క్విజ్ తదితర పోటీల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగుతనం ఉట్టిపడేలా సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ మాతృభాషపై పట్టు సాధించడంతో పాటు విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించడమే లక్ష్యమన్నారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కాళోజి నారాయణ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, కవులకు సంబంధించిన చరిత్ర పుస్తకాలను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో డీడీలు ఫిరంగి, చందన, ఆర్‌సీవో అరుణకుమారి, ఏసీఎంవోలు, ఏటీడీవోలు, స్పోర్ట్స్ అధికారి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.






## వైభవంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు

**సారపాక, ప్రభాతవార్త:**



గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తాళ్లగొమ్మూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మమ్మ కాలనీలో టీమ్ త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరించి శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను భక్తిశ్రద్ధలతో పూజించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణలు, శివనామస్మరణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య శివపార్వతుల కళ్యాణ వేడుక కన్నులపండువగా సాగింది. ఈ కార్యక్రమం మొత్తం భక్తిమయ వాతావరణం నెలకొంది. కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు మహాలక్ష్మమ్మ కాలనీతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు శివపార్వతులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ శివపార్వతుల అనుగ్రహంతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు వెల్లివిరియాలని, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## ఉద్యమకారుల హామీలు అమలు చేయాలి

### గోపగాని శంకరరావు డిమాండ్

**బూర్గంపహాడ్, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలు, ఉద్యమకారులు కీలక పాత్ర పోషించారని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర ముఖ్య సలహాదారు గోపగాని శంకరరావు అన్నారు. లక్ష్మీపురంలో నిర్వహించిన ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, పక్కా ఇళ్లు కల్పించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన ఉద్యమకారులకు తెలంగాణ ఉద్యమకారులతో సమానంగా సౌకర్యాలు కల్పించాలని, ఉద్యమ కేసులు ఎదుర్కొన్న యువతకు ఉద్యోగాల్లో వయోపరిమితి సడలింపు, రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో నల్లమోతు సురేష్, బట్టు రాజేందర్ నాయక్, పోడియం నరేందర్, మూల నాగిరెడ్డి, కొక్కొండ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

### సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### ఆర్లగూడెం ఆశ్రమాకు పాఠశాలలో వైద్య శిబిరం

**దుమ్ముగూడెం: ప్రభాతవార్త (సెప్టెంబర్ 22)**
దుమ్ముగూడెం మండల పరిధిలోని ఆర్లగూడెం గిరిజన బాలుర వసతి గృహంలో దుమ్ముగూడెం పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ రుక్మాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు విద్యార్థుల ఉద్దేశించి డాక్టర్ రుక్మాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆహార పదార్ధాల పరిశుభ్రత సమతుల్య ఆహారం పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు అనంతరం వసతి గృహం లోని వంటశాలను పరిశీలించి వంటగది శుభ్రత తదితర అంశాలపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బంది కి సూచించారుఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ గంగాధర్ ఏ ఎన్ ఎం హైమావతి గంగమ్మ ఎం ఎల్ హెచ్ పి లావణ్య ఆశలు హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు

# క్లిష్ట మైన రక్త బోన్ మ్యారో కేసులకు యశోదలో చికిత్సలు అందుబాటులో

**64 ఏళ్ళ వ్యక్తి కి పదే పదే రక్తం ఎక్కించాల్సిన పరిస్థితి...**

**అనీమియా, ప్లేట్‌లెట్ల తగ్గుదలతో బైసైటోపీనియాబోన్‌మారో పరీక్షల్లో ప్రైమరీ మైలోఫైబ్రోసిస్ అనుమానం..**

**మలకపేట యశోద హాస్పిటల్ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ ఫరాజ్ అహ్మద్**



ఖమ్మం వైద్య విభాగం,సెప్టెంబర్ 22(ప్రభాత వార్త )

మలక్ పేట్ హైదరాబాద్ యశోద హాస్పిటల్ లో క్లిష్ట మైన రక్త బోన్ మారో కేసులకు చికిత్స అందుబాటులో ఉన్నాయని క్యాన్సర్ వైద్యనిపుణులు డాక్టర్ ఫరాజ్ అహ్మద్ తెలిపారు. మంగళవారం యశోద కన్సల్టింగ్ సెంటర్లో మెలికే సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..63 ఏళ్ల వ్యక్తి కి పదే పదే రక్తం ఎక్కించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారిలో అనీమియా, ప్లేట్‌లెట్ల తగ్గుదలతో బైసైటోపీనియాబోన్‌మారో పరీక్షల్లో ప్రైమరీ మైలోఫైబ్రోసిస్ అనుమానం రావడంతో అతనికి మెరుగైన లో చికిత్స అదించామని తెలిపారు.తరచూ జ్వరం, తీవ్రమైన నీరసం, పదేపదే రక్తం ఎక్కించాల్సిన పరిస్థితిని నిర్లక్ష్యం చేయకూడదని సూచిస్తున్నారు. ఇలాంటి లక్షణాలతో బాధపడుతున్న ఖమ్మంకు చెందిన 64 ఏళ్ల వ్యక్తికి మలక్ పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో నిర్వహించిన పరీక్షల్లో అనీమియా, థ్రాంబోసైటోపీనియాతో కూడిన బైసైటోపీనియా ఉన్నట్లు గుర్తించామ న్నారు. పెరిఫెరల్ బ్లడ్ స్మెర్ లో లేవుకరీత్రోబ్లాస్టిక్ బ్లడ్ పిక్చర్ కనిపించింది.నెల రోజులుగా జ్వరం,ఒళ్లు నొప్పులు,నీరసం తదితర సమస్యలతో బాధపడుతున్న ఆయనకు ఆసుపత్రికి రాక ముందే ఒక్క నెలలో ఏదు యూనిట్ల పి ఆర్ బి సి ఎక్కించాల్సి వచ్చింది. కారణాన్ని తెలుసుకు నేందుకు బోన్ మ్యారో ఆస్పిరేషన్, బోన్ మ్యారో బయాప్సీ నిర్వహించగా ప్రైమరీ మైలోఫైబ్రోసిస్ (పీఎంఎఫ్ ) ఉండవచ్చనే సూచనలు కనిపించాయి. పి ఎన్ హెచ్ ప్యానెల్ నెగటివ్ గా వచ్చింది. ఆసుపత్రిలో మరో మూడు యూనిట్ల లేవుకాడేప్లీటెడ్ పి ఆర్ బి సి అందించారు. చికిత్స మధ్యలో ఆయాసం, జ్వరం, ఆక్సిజన్ శాతం తగ్గడంతో ఐసీయూకు తరలించి బ్రాడ్ స్పెక్ట్రమ్ యాంటిబయోటిక్స్ తో పాటు సపోర్టివ్ కేర్ అందించారు. స్టెరాయిడ్స్ , ఇమిడ్స్ , ఇంజక్షబుల్ ఈ పి ఓ తో చికిత్స ప్రారంభిం చడంతో పరిస్థితి క్రమంగా మెరుగుపడి హీమో డైనమికల్‌గా స్థిరపడిందని అన్నారు. అనీమియా, ప్లేట్‌లెట్లు తగ్గిపోవడంతో పాటు పదేపదే రక్తం అవసరమయ్యే రోగుల్లో కారణాన్ని తెలుసుకునే ందుకు సమగ్ర హీమటాలజీ, బోన్‌మారో పరీక్షలు కీలకమన్నారు. ఈ రోగి బోన్‌మారో పరీక్షల్లో పి ఎం ఎఫ్ ఉండవచ్చనే సూచనలు కనిపించాయని, తదుపరి మూల్యాంకనం, నిరంతర ఫాలోఅప్ అవసరమని తెలిపారు. క్లిష్టమైన రక్త, బోన్‌మారో సంబంధిత వ్యాధుల నిర్ధారణ, చికిత్సకు హీమటాలజీ, హీమటోఆంకాలజీ, క్రిటికల్ కేర్ సహా బహుళ విభాగాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని యశోదా ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది.




## సెప్టెంబర్ 24న జాబ్ మేళా

**జిల్లా ఉపాధి అధికారిణి మాధవి**

ఖమ్మం కలెక్టరేట్ సెప్టెంబర్ 21. (ప్రభాతవార్త)

జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగం హైదరాబాద్ అపోలో ఫార్మసీ, ఖమ్మం లోని వరుణ్ మోటార్స్, భారత్ హ్యుందాయి లలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 24న గురువారం ఉదయం 10 గంటలకు ఖమ్మం హవేలీ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న టిటిడిసి నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.హైదరాబాద్ లో పని చేసే విధంగా అపోలో ఫార్మసీలో ఫార్మాసిస్ట్, ట్రైనీ ఫార్మాసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, ప్రొడక్ట్ అడ్వైజర్, రిటైల్ ట్రైనీ అసోసియేట్ గా పని చేయుటకు 1835 సంవత్సరాల వయస్సు గలవారు, సంబంధిత ఉద్యోగానికి డి ఫార్మసీ / బి ఫార్మసీ / ఎం ఫార్మసీ (పిసిఐ) / ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ అర్హత గల యువతీ, యువకులు అర్హులని, ఎంపికైన వారికి వేతనం 12 వేల 500 నుండి 25 వేల వరకు ఉంటుందని అన్నారు.ఖమ్మంలో పని చేసే విధంగా వరుణ్ మోటార్స్ లో సేల్స్ ఎగ్జిక్యూటివ్ / టెక్నీషియన్/సెక్యూరిటీ/ అడ్వైజర్ ఉద్యోగాలకు 22 నుండి 40 వయస్సు గల వారు అర్హులనీ, ఎంపికైన వారికి వేతనం 15 వేల నుండి 30 వేల వరకు ఉంటుందని, ఖమ్మం భారత్ హ్యుందాయి లో ఫీల్డ్ సేల్స్ కన్సల్టెంట్స్/ టెక్నీషియన్/ టెలి కాలర్ ఉద్యోగాలకు 23 నుండి 30 సంవత్సరాల వారు అర్హులనీ, ఎంపికైన వారికి వేతనం 10 వేల నుండి 18 వరకు ఉంటుందని తెలిపారు.మొత్తం దాదాపు 127 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్ మేళాకు హాజరు కావాలని, ఇతర వివరాలకు హెచ్ ఆర్ నంబర్ 92841107531, 7036902902, 7207917714 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## రేషన్ డీలర్ల సంఘం ఖమ్మం జిల్లా నూతన కమిటీ ఎన్నిఅధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దొండా దర్గయ్య, సయ్యద్ రఫీ నియామకం

ఖమ్మం అర్బన్, సెప్టెంబర్ 22(ప్రభాత వార్త )

ఖమ్మం జిల్లా రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘం జిల్లా సమావేశం మంగళవారం ఖమ్మం నగరంలోని అశోక ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ధరావత్ మోహన్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో భాగంగా ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా కొనిజర్ల మండలానికి చెందిన దొండా దర్గయ్యను, ప్రధాన కార్యదర్శిగా ఖమ్మం నగరానికి చెందిన సయ్యద్ రఫీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌరవాధ్యక్షుడిగా ఖమ్మం రూరల్ మండలానికి చెందిన యల్లంపల్లి యాదగిరిని, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా షేక్ జానిమియా, కోశాధికారి గా గుమ్మడవెల్లి సంతోష్ కుమార్, గౌరవ సలహాదారుగా కల్లూరు మండలానికి చెందిన రంగారావులను నియమించారు. వీరితోపాటు మరో 34 మందిని కమిటీ లో బాధ్యులుగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు అభినందించారు. ఖమ్మం జిల్లాలో తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం బలోపేతం చేయడంలో నూతన కమిటీ శక్తి వంచన లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం జరిగే సభ్యత్వ నమోదులో కీలక భూమికి పోషించి అత్యధికంగా రేషన్ డీలర్లను స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర సంఘం రానున్న రోజుల్లో రేషన్ డీలర్లకు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తుందని, గౌరవ వేతనంతో పాటు కమిషన్ పెంపు సాధన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం సాగిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లాకు చెందిన అన్ని మండలాల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు, రేషన్ డీలర్ల ఖమ్మం అర్బన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, సాయికుమార్ గోళ్ళ మురళి, ఖాజా మియా, జానీ మియా, గాజుల భద్రయ్య, తోట వెంకన్న, లగిశెట్టి వెంకటేశ్వర్లు, సత్తార్మియా తదితరులు పాల్గొన్నారు.

## కుక్క కాటుకు రేబిస్ టీకా అవసరం

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు**

**వారం రోజుల పాటు ప్రపంచ రేబిస్ అవగాహనా కార్యక్రమాలు**



ఖమ్మం వైద్య విభాగం, సెప్టెంబర్ 22(ప్రభాత వార్త )

కుక్కలు, ఇతర జంతువులు కరిచినప్పుడు రేబిస్ టీకా అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు అన్నారు.ప్రపంచ రేబిస్ వారోత్సవాలు ఈ నెల 22 నుండి 28 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజలకు రేబిస్ వ్యాధి నివారణ, కుక్కలు, ఇతర జంతువుల కాటు వల్ల కలిగే ప్రమాదాలు, తీసుకోవాల్సిన తక్షణ జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారని ప్రజలు తప్పక పాటించవలసిన జాగ్రత్తలు, కుక్క లేదా ఇతర జంతువు కరిచిన వెంటనే గాయాన్ని సబ్బు, ప్రవహించే నీటితో కనీసం 15 నిమిషాలు శుభ్రంగా కడగాలి, గాయానికి పసు పు, మిరపపొడి, నూనె, మట్టి వంటి పదా ర్థాలు రాయకూడదు అని పేర్కొంటూ, జంతువు కరిచిన వెంటనే ఆలస్యం చేయకుండా సమీపం లోని ప్రభుత్వ ఆసుపత్రి/ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలి అని పేర్కొంటూ ,వైద్యుల సూచన మేరకు రేబిస్ వ్యాక్సిన్ మరియు అవసరమైనప్పుడు రేబిస్ ఇమ్యూనోగ్లోబులిన్ (రిగ్ ) తీసుకోవాలి అని, పెంపుడు కుక్కలకు క్రమంత ప్పకుండా రేబిస్ టీకాలు వేయించాలని, వీధి కుక్కలను రెచ్చగొట్టకుండా, ముఖ్యంగా చిన్న పిల్లలు వాటికి దూరంగా ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు."రేబిస్‌ను నివారించవచ్చు – జంతువు కరిచినప్పుడు వెంటనే చికిత్స తీసుకోవడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చు." అని పేర్కొన్నారు.

## గణేష్ నిమజ్జనానికి విస్తృత ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

ఖమ్మం కలెక్టరేట్ సెప్టెంబర్ 22: (ప్రభాతవార్త)

జిల్లావ్యాప్తంగా నేడు నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిపేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. నిమజ్జన ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించేందుకు వివిధ శాఖల అధికారులను ఇన్‌ఛార్జ్‌లుగా నియమించినట్లు ఆయన అన్నారు.పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తగినంత మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిమజ్జనం కోసం 18 రన్నింగ్/రెగ్యులర్ క్రేన్లు,2 రొటేటింగ్ క్రేన్లను అందుబాటులో ఉంచారన్నారు. గ్యాస్ కట్టర్లు, స్పేర్ డ్రైవర్లు, సాంకేతిక సిబ్బందిని షిఫ్టుల వారీగా కేటాయించినట్లు తెలిపారు.మత్స్య శాఖ, విపత్తు నిర్వహణ శాఖ సమన్వయంతో నిమజ్జన పాయింట్ వద్ద నిపుణులైన 150 మంది గజ ఈతగాళ్ళను, లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్స్, ట్యూబులు, త్రాళ్లు మరియు రక్షణ పడవలు షిఫ్ట్ ల వారిగా అందుబాటులో ఉంచామన్నారు. మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల ద్వారా నిమజ్జన మార్గాల్లో పారిశుద్ధ్యం, నిరంతర తాగునీటి సరఫరా, తాత్కాలిక దీపాలు, బారికేడింగ్ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఊరేగింపు మార్గాల్లో దారికి అడ్డంగా ఉన్న విద్యుత్ కేబుల్స్, లోహ్యాంగింగ్ వైర్లను సరిచేసి, విద్యుత్ అంతరాయం లేకుండా అధికారులు, సిబ్బంది నియమించామన్నారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, ప్రత్యేక వైద్య బృందాలు, కాటు (పాము/కుక్క) మందులు, 108 అంబులెన్స్‌లను 24 గంటల పాటు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో ఫైర్ ఇంజన్లు, రెస్క్యూ వాహనాలు సిద్ధంగా ఉంచామన్నారు.భక్తులందరూ సూచించిన రూట్ మ్యాప్ ప్రకారం నిమజ్జన ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. అధికారులకు, పోలీసులకు సహకరించి గణేష్ నిమజ్జన మహోత్సవాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## పాండురంగాపురంలో కుంకుమార్చనలు

ఖమ్మం అర్బన్, సెప్టెంబర్ 22(ప్రభాత వార్త )



ఖమ్మం కార్పొరేషన్ నాలుగో డివిజన్ పాండు రంగాపురంలో మహిళల కుంకుమార్చనలు నిర్వహిం చారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ బాల గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని పసుపు, కుంకుమ, గాజులు లతో అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ దండ జ్యోతిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఎంతో భక్తితో ఒక్కటిగా ఈ కుంకుమార్చనలో పాల్గొని కమిటీ వారు చేసే కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మీకు కార్యక్రమాన్ని నిర్వహించిన కమిటీ సభ్యులు రమేష్ మధు. లక్ష్మణ్. అనిల్. కృష్ణ ప్రసాద్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు

## మద్యం దుకాణాలు, బార్లల్లో 24 గంటల పాటు మద్యం విక్రయాలపై నిషేధం

**పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు**

ఖమ్మం క్రైమ్ ప్రభాతవార్త

ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మద్యం దుకాణాలు, బార్లు !! రెస్టారెంట్లు, క్లబ్బులు ఇతర మద్యం విక్రయించే/సర్వ్ చేసే సంస్థలు 23 092026 ఉదయం 6.00 గంటల నుంచి 24092026 ఉదయం 6.00 గంటల వరకు పూర్తిగా మూసివేయాలని, ఈ సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం విక్రయాలు లేదా సరఫరా చేయరాదని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశించారు. 23092026 (బుధవారం) వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ప్రజల శాంతిభద్రతలను,ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు తెలంగాణ ఎక్సైజ్ చట్టం -1968లోని సెక్షన్ 20ను వినియోగిస్తూ,ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# గోదావరి జలాలను కొత్తగూడెం జిల్లాకు ఇవ్వాలి: మాజీ ఎమ్మెల్యే గుమ్మడి

జూలూరుపాడు, ప్రభాతవార్త,

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు అందజేయాలని ఇల్లందు మాజీ శాసనసభ్యులు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు గుమ్మడి నరసయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కెచ్చల రంగారెడ్డిలు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని వినోబానగర్ ప్రాంతంలోని సీతారామ ప్రాజెక్ట్ కాల్వను పార్టీ ప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో వేల ఎకరాలు భూములు సేకరించి, ప్రాజెక్టు నిర్మాణం జరిగితే జిల్లా రైతాంగానికి గోదావరి జలాలను అందించకుండా ఇతర ప్రాంతాలకు జలాలను తరలిస్తూ ఉమ్మడి జిల్లాలోని మంత్రులు జలదోపిడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా చివరి ప్రాంతమైన జూలూరుపాడు నుంచి ఖమ్మం జిల్లాకు నీరు తరలిస్తున్నారని, అదే సమయంలో ఇక్కడ రైతాంగానికి కూడా నీరు



అందించేందుకు చర్యలు చేపట్టకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. గతంలో డిజైన్ చేసిన విధంగా రోళ్లపాడు చెరువు నింపడం ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొత్తానికి పక్కనే ఉన్న మహబూబాబాద్ జిల్లాకు కూడా తక్కువ ఖర్చుతో నీరందించే అవకాశం ఉన్నప్పటికీ గతంలో అధికారంలో ఉ న్నటిఆర్ఎస్ ప్రభుత్వం రీ డిజైన్ చేసి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి చుక్క నీరును ఈ జిల్లా రైతాంగానికి అందించలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మొదట నష్టపోతున్న ప్రాంతానికి నీరు అందించకుండా మంత్రులు ఇతర ప్రాంతాలకు నీరు తరలించేందుకు యుద్ధ ప్రాతిపదికన నిధులు కేటాయించి కాలువలు నిర్మించారని, పంటలు పండే వారికే మరో పంట పండేందుకు నీరు అందించి మంత్రులు తమ కుటిల బుద్ధిని చాటుకున్నారని అన్నారు. జిల్లాలోని ఏజెన్సీ గిరిజన ప్రాంతాలకు నీరు అందించేందుకు తక్షణమే సీతారామ ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. జూలూరుపాడు ప్రాంతంలో దండాల చెరువు, సెనగచెరువు, కప్పలకుంట చెరువులకు నీరు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన పంట కాలువలు తీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జాటోత్ కృష్ణ, అమర్లపూడి రాము, ఏదులాపురం గోపాలరావు, బానోతు ధర్మ, యాకుషావలి, కల్లూరి కిషోర్, వెంకన్న, లింగాల వీరభద్రం, తోటకూరి నరేష్, వెంకన్న రాయల సిద్దు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ సదుపాయాలపై ఎస్పీ దృష్టి

## డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీం, ఆయుధ విభాగాల పరిశీలన





కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

పోలీస్ విభాగాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు సిబ్బందికి మెరుగైన పని వాతావరణం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఓఎస్డీ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీం, ఆయుధ కర్మాగారాలు, వర్క్‌షాప్, వ్యాయామశాల, సిబ్బంది బ్యారక్స్‌ను పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌లో జాగిలాల ఆరోగ్యం, ఆహారం, వసతి, శిక్షణపై వివరాలు తెలుసుకుని, నేరాల ఛేదనలో వాటి సేవలను సమర్థవంతంగా వినియోగించుకునేలా నిరంతరం శిక్షణ, ప్రాక్టీస్ కొనసాగించాలని తెలిపారు. బాంబ్ డిస్పోజల్ టీం వద్ద ఉన్న పరికరాలు, భద్రతా సామగ్రిని పరిశీలించిన ఎస్పీ.. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేలా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాయామశాల, బ్యారక్స్‌ను పరిశీలించి సిబ్బంది శారీరక దారుఢ్యంపై దృష్టి సారించాలని, బ్యారక్స్‌లో తాగునీరు, పరిశుభ్రత, వసతి వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పోలీస్ భవనాలు, పరికరాలు, ఇతర వనరులను సక్రమంగా నిర్వహిస్తూ సిబ్బందికి మెరుగైన వసతులు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు.

గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి అన్నదానంలో పాల్గొన్న సీఐ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నేత తూము చౌదరిలక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త: మండలంలోని హేమచంద్రపురం గ్రామం ఎస్సీ కాలనీలో శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి సన్నిధిలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తూము చౌదరి, చుంచుపల్లి సిఐ ఆర్. వెంకటేశ్వర్లు పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. గణేష్ నిమజ్జన వేడుకలు పూర్తయ్యే వరకు కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అందరికి నవరాత్రుల శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కూచిపూడి జగన్, లక్ష్మీదేవిపల్లి ఎస్సై అఖిల, కాంగ్రెస్ నాయకులు పూనెం శ్రీనివాస్, ఎం.డి. గౌస్ పాషా, గోలి శ్రీను, మాజీ సర్పంచ్ బండా వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కాలేజీకి వెళ్లిన విద్యార్థిని అదృశ్యం

## యువకుడిపై అనుమానం

.. పాల్వంచ క్రైమ్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

కాలేజీకి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లిన బీటెక్ విద్యార్థిని తిరిగి ఇంటికి రాకపోవడంతో పాల్వంచ రూరల్ పోలీసులను ఆశ్రయించిన ఘటన వెలుగులోకి వచ్చింది. లక్ష్మీదేవిపల్లి (ఎస్) గ్రామానికి చెందిన చింతల సుజాత కుమార్తె చింతల సౌమ్య (21) పాల్వంచలోని కేఎల్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. ఈ నెల 19న ఉదయం 10 గంటలకు కాలేజీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన సౌమ్య సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువులను ఆరా తీశారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సౌమ్యను మణుగూరు మండలం కొండాయిగూడెంకు చెందిన కారం మధు (25) తీసుకెళ్లి ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తూ, అతడిని విచారించి తన కుమార్తె ఆచూకీ కనుగొనాలని తల్లి కోరారు.

# అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి

జూలూరుపాడు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 22:





మండల పరిధిలోని వెంగన్నపాలెం గ్రామంలో నర్సింగ్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వెంగన్నపాలెం గ్రామానికి చెందిన సతీష్, రాజేశ్వరి దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్ద కుమార్తె హరిణి (19) ఖమ్మం పట్టణ సమీపంలోని ఒక కళాశాలలో నర్సింగ్ విద్యను అభ్యసిస్తుంది. కొద్ది రోజుల క్రితం వెంగన్నపాలెం ఆమె ఇంటికి వచ్చింది. మంగళవారం ఇంటి వెనక మరుగుదొడ్లు ఉన్న ఇరుకు ప్రాంతంలో హరిణి విగతా జీవిగా పడి ఉంది. ఆమె శరీరంపై గాయాలు ఉండటంతో స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీలక్ష్మి, సబ్ ఇన్స్పెక్టర్ జీనత్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థిని మృతి విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. కాగా విద్యార్థిని హరిణి మృతికి సంబంధించిన పూర్తి వివరాలను దర్యాప్తు అనంతరం పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

# కాంగ్రెస్ చుట్టూ తల్లాడ వ్యాపారులు

తల్లాడ సెప్టెంబర్ 22 ప్రభాతవార్త

భూమి తన చుట్టూ తాను తిరిగినట్లు తల్లాడ మండల ఆర్యవైశ్య వ్యాపారులు గత మూడు రోజుల నుండి ఉన్నట్టుండి కాంగ్రెస్ చుట్టూ తిరుగుతున్నారు వారికి కాంగ్రెస్ నాయకులు పై వల్ల మాలిన ప్రేమ పుట్టు కొచ్చిందా జరుగుతున్న పరిణామాలపై గత్యంత రం లేక ఇలా వ్యవహరిస్తున్నారా అనే ప్రశ్నలకు అనేక సందేహాలు వస్తున్నాయి రెండు రోజుల క్రితం జిల్లా కాంగ్రెస్ నాయకులు మట్ట దయానందును గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆహ్వానించి మండపంలోనే సన్మానం చేశారు ఒక మాటలో చెప్పాలంటే వ్యాపారులందరూ దయానందు మాకు ఎప్పటినుండో పరిచయమని ఆప్యాయంగా పలకరిస్తూ ఫోటోల కోసం పోటీపడ్డ సంఘటన మరవకముందే మంగళవారం రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆహ్వానించి స్వాగతం పలికి పూజలు చేయించారు. అంతవరకు బాగానే ఉండగా కళ్యాణ మండపం నిర్మాణంపై వ్యాపారులని ఆరా తీస్తూ నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తం చేసిన అనంతరం రాజకీయ నాయకులు పొంగులేటితో ఫోటోలు దిగుతుండగా వ్యాపారులు మేము సపరేట్గా ఫోటో దిగుతామని పోటీ పడి మంత్రిని సన్మానించి ఫోటోలు దిగారు విచిత్రం ఏమిటంటే గత కొన్ని సంవత్సరాల నుండి జవ్వాజి సుబ్బారావు కొడుక్కి పెత్తనం ఇచ్చి ఇంటి వద్దనే ఎవరికి కనపడకుండా విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన మంత్రిపై అభిమానంతో మండపం వద్ద ప్రత్యక్షం కావడం చర్చనీయాంశంగా మారింది దీనికి తోడు అతని సోదరుడు నరసింహారావు వారి తనయులు పెద్ద నగేష్ చిన్న నగేష్ లు వారసత్వంగా నాయకత్వ లక్షణాలు చేస్తున్నారు





# బంజారా కమ్యూనిటీ భవన్‌కు త్వరలో శంకుస్థాప న

## విద్యానగర్‌లో స్థలం కేటాయింపు.. ఎమ్మెల్యే కూనంనేని హామీ



కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

జిల్లా కేంద్రంలో బంజారా కమ్యూనిటీ భవన్ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేస్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సోమవారం బంజారా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ బానోత్ వీరునాయక్ ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యేను కలిసి కమ్యూనిటీ భవన్ ఏర్పాటుపై వినతిపత్రం అందించారు. జిల్లా కేంద్రానికి వివిధ పనుల కోసం వచ్చే బంజారాలకు సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు శాశ్వత వేదిక లేదని జేఏసీ నాయకులు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే విద్యానగర్ కాలనీలో ప్రభుత్వ స్థలం కేటాయించడంతోపాటు భవన్ నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్‌పాషా మాట్లాడుతూ బంజారాలకు అన్ని విధాలా సహకరిస్తామన్నారు. మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే చొరవతో భవన్ ఏర్పాటుకు మార్గం సుగమమైందన్నారు. స్థలం కేటాయింపుపై ఎమ్మెల్యే కూనంనేని, సాబీర్‌పాషా, మేయర్ గణేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ లాల్‌సింగ్‌లకు జేఏసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు యూనిఫాం, షూస్ పంపిణీ

రుద్రంపూర్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:



మండలంలోని గౌతంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించిన స్కూల్ యూనిఫార్మ్, షూస్‌ను మంగళవారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ సపావత్ కళ్యాణి సురేష్ దంపతులు విద్యార్థులకు యూనిఫార్మ్, షూస్ అందజేశారు. సర్పంచ్ దంపతులు మాట్లాడుతూ... విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గంగారావు, పాఠశాల హెచ్‌ఎం గుగులోత్ చంద్రు, ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

## నూకల రంగా రావుకు ఘన సన్మానం

పాల్వంచ టౌన్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:

పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన నూకల రంగా రావును కాంగ్రెస్ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాల్వంచ పట్టణం, మండలంలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గంగిరెడ్డి భువన సుందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి నరహరి, బాలినేని నాగేశ్వరరావు, జోషి, దొప్పలపూడి సురేష్ బాబు, పాపారావు, గంగుల నరేందర్ రెడ్డి, బాలాజీ, ప్రసాద్, హరి తదితరులు పాల్గొన్నారు.

# యువత అన్ని రంగాల్లో ముందుండాలి

**గుండాల, సెప్టెంబరు 22 ప్రభాతవార్త :**

యువత చెడు వ్యసనాలను వీడి ముందుకు సాగాలని డ్రగ్స్, మత్తు పదార్థాలను నిషేధించడమే లక్ష్యంగా పనిచేయాలని మాస్ లైన్ డివిజన్ నాయకులు శంకరన్న, పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు పూనెం మంగయ్యలు యువతకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కొడవటంచ గ్రామంలో మంగళవారం ప్రగతిశీల యువజన సంఘం గ్రామ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వుకే శ్రావణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి ఈసం శంకరన్న, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షులు పూనేం మంగయ్య లు మాట్లాడుతూ యువకుల బాధ్యత ఈ దేశానికి ఎంతో ముఖ్యమైనదని, యువత గ్రామ స్థాయి నుంచి సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా భవిష్యత్తు కోసం




ఆలోచించాల్సిన సమయంలో, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతను డ్రగ్స్, గంజాయి, మత్తు పానీయాల వైపు నెడుతున్నాయని విమర్శించారు. ఈ మండలంలో 54 గ్రామాలు ఉండగా, 146 బెల్ట్ షాపులు, వైన్ షాపు ముసుగులో విచ్చలవిడిగా నడుస్తున్నాయని, ఈ షాపుల ముసుగులో గుట్కా, గుడుంబా, గంజాయి, డ్రగ్స్ ను స్వార్థ ప్రయోజనాల కోసం అమ్ముతున్నారని, దీంతో యువత భవిష్యత్తు రోజురోజుకూ మత్తులో మునిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు చూస్తూ మౌనంగా ఉంటున్నారని ఆరోపించారు. శిల్రి డిమాండ్లు : గ్రామాల్లో అక్రమంగా నడుస్తున్న 146 బెల్ట్ షాపులను వెంటనే రద్దు చేయాలి. గుడుంబా, డ్రగ్స్ మాఫియాను అరికట్టాలి, గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి పాలక ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించకపోతే యువతను, రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను సమీకరించి పెద్ద ఎత్తున మిలిటెంట్ పోరాటం చేస్తామని హెచ్చరించారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో. వజ ధర్మరాజు. కోడెం కృష్ణయ్య. కొమరం నరెందర్. ఈసం కరణ్. ఈసం భస్కర్. ఈసం హరేష్. ఈసం క్రిష్ణ ముక్తి. ఈసం రజినికంత్. కొటెం సుధాకర్. బాలరాజు చీమల ప్రసాద్. చీమల సుందరావు. కల్తి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# మహాసభలను జయప్రదం చేయాలని బైక్ ర్యాలీ.

**గుండాల సెప్టెంబరు 22 ప్రభాతవార్త :**

ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఖమ్మం పట్టణంలో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జాతీయ 4వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గుండాల మండలం ముత్తాపురంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అఖిల భారత రైతుకూలి సంఘం ( ఏఐకేఎంఎస్ ) మండల అధ్యక్షులు గడ్డం లాలయ్య మాట్లాడుతూ దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై రైతులు కూలీలు ఏకమై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు రైతులకు 12000 ఇస్తామని, వ్యవసాయ రంగాన్ని రక్షిస్తామని ప్రగల్బాలు పలికిన ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు వ్యవసాయాన్ని ధార దత్తం చేస్తూ నూతన వ్యవసాయ రంగ చట్టాలతో పల్లెల్లో



నివసించే రైతులను దివాలా తీస్తున్నాయని అన్నారు. నూతన యాప్ లను తీసుకొచ్చి ఏజెన్సీ ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం వల్ల సరైన సమయానికి ఎరువులు అందకపోవడం వల్ల రైతుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క వర్షాలు అనుకూలించక వ్యవసాయం మొత్తం బీడుబడిపోయిందని కౌలుకు తీసుకున్న రైతుల పరిస్థితి అగ మ్యగోచరంగా మారిందని అన్నారు. ఇలాంటి సమస్యలపై చర్చించడం కోసం ఈ దేశ రైతాంగ సమస్యల గురించి భవిష్యత్తు కార్యక్రమం గురించి చర్చించడం కోసం ఈ దేశవ్యాప్తంగా జరిగే మహాసభలను రైతులు, కూలీలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం నరసన్న, ఉపసర్పంచ్ తాటి రమేష్, ముక్తి ముత్తయ్య, మోకల రమేష్, మోకాల్ల సూర్యనారాయణ, మోకాళ్ళ రమణయ్య, పోతయ్య, కుంజ వెంకటేశు, గొగ్గల శ్రీను, గుగ్గిల సాంబశివరావు, జబ్బా వెంకన్న, కల్తి నరసింహారావు, జనగం లాలయ్య లు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం పోరాట ఫలితమే మారెళ్లపాడు లిఫ్ట్

### 22 ఎ సమస్యను పరిష్కరించాలి

### అశ్వాపురాన్ని కరువు మండలంగా ప్రకటించాలి.

**అశ్వాపురం, ప్రభాతవార్త, సెప్టెంబర్ 22:**

మండలానికి సాగునీరు అందించాలనే డిమాండ్‌తో సీపీఎం ఆధ్వర్యంలో గత కొంతకాలంగా నిర్వహించిన ఆందోళనలు, పోరాటాల ఫలితంగానే మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం సాకారమైందని సీపీఎం సీనియర్ నాయకులు సర్గం బాలనరసయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కే. బ్రహ్మచారి, జిల్లా కమిటీ సభ్యులు గద్దల శ్రీనివాస్ పేర్కొన్నారు. మల్లెలమడుగులో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, మారెళ్లపాడు లిఫ్ట్ ద్వారా అశ్వాపురం మండలంలోని కొంత ప్రాంతానికి మాత్రమే సాగునీరు అందే అవకాశం ఉందని తెలిపారు. మండలంలోని మిగిలిన ప్రాంతాలకు కూడా సాగునీరు అందించేలా కుడివైపు ప్రాంతంలో మరో లిఫ్ట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుమ్మరిగూడెం గ్రామంలో ప్రస్తుతం ఉన్న లిఫ్ట్ నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా మరో లిఫ్ట్‌ను నిర్మించి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఎల్ నినో ప్రభావంతో పూర్తిస్థాయిలో నాట్లు వేయలేకపోయామని, ఫలితంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం నాయకులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అశ్వాపురం మండలాన్ని కరువు ప్రభావిత ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలో 22ఎ నిషేధిత జాబితా కారణంగా సుమారు 400 మంది రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని, రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నెల్లిపాక రెవెన్యూ పరిధిలో 22ఎ కింద విధించిన నిషేధాన్ని రద్దు చేసి, సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు బద్దం సంబిరెడ్డి, దండి రాములు, బొమ్మరాతి రామయ్య, అశోక్‌రెడ్డి, గొడుగు వెంకన్న, సర్గం వీరరాఘవులు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందుకు అధిక ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

### సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే కోరం వినతి

**ఇల్లందు, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:**



ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, సహచర గిరిజన ఎమ్మెల్యేలతో కలిసి హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లి వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రికి శ్రీవారి శాలువ కప్పి సత్కరించి, తిరుమల మహా ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ సమక్షంలో గిరిజన నియోజకవర్గాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అధిక సంఖ్యలో ఇళ్లు కేటాయించాలని గిరిజన ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కోరారు. కోరం కనకయ్య మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో అర్హులైన పేద కుటుంబాలకు ప్రాధాన్యత ఇచ్చి ఎక్కువ ఇళ్ల మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.




## హోమ చూర్ణం,ఆవు నెయ్యి పంపిణీ



**కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:**

వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గణేష్ మండపాల నిర్వాహకులకు ఉచితంగా హోమ చూర్ణం, ఆవు నెయ్యిని పంపిణీ చేస్తున్నట్లు గణేష్ నిమజ్జన కమిటీ అధ్యక్షులు యెర్రా కామేష్ తెలిపారు. మంగళవారం కొత్తగూడెంలోని స్థానిక వివేకానంద హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగింపు కార్యక్రమంలో ఆయా గణేష్ మండపాల వద్ద హోమ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావంతో ఈ వినాయక ఉత్సవాలు జరుపుకుంటున్నారని ముఖ్యంగా యువత ఎటువంటి చెడు వ్యసనాలకు లోనూ కాకుండా మాలలు ధరించి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం శుభసూచకమని పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో హోమ కార్యక్రమాలను నిర్వహించేందుకు అవసరమైన సామగ్రిని అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు.. గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన మండపాల నిర్వాహకులు, భక్తులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి నాగేశ్వరరావు, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి దారా రమేష్, వందనపు శ్రీధర్, అకిరెడ్డి మహేష్, మెరుగు చింటేశ్వర్, అగుల యాకయ్య, కుసనా సాగర్, నాగుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

## కేశవాపురంలో అన్నదానం

**పాల్వంచ టౌన్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:**



గణనాథుడి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాల్వంచ మండలం కేశవాపురం గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కె.పి. హనుమాన్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అన్నప్రసాద కార్యక్రమాన్ని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు ప్రారంభించారు. కొత్వాల మాట్లాడుతూ గణేశుడి ఆరాధన ఎంతో పవిత్రమైనదని, ఏ శుభకార్యాన్ని ప్రారంభించినా ముందుగా విఘ్నేశ్వరుడిని పూజించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చింతా నాగరాజు, గంధం రామయ్య, అజ్మీరా రమేష్, గంధం నరసిం హారావు, గంధం సతీష్, గంధం వెంగళరావు, ఎస్‌కే షఫీ, బూసి శ్రీను పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల రక్షణకు కట్టుబడి ఉంటాం

**కొత్తగూడెం, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:**

కార్మికుల హక్కుల రక్షణ, సంక్షేమానికి సంపూర్ణంగా కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ విభాగాల కార్మికులకు రెండేళ్లకు సంబంధించిన యూనిఫారాలు, కాస్మొటిక్స్ పంపిణీ కార్యక్రమం మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించారు. మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ఎమ్మెల్యే కార్మికులకు సామగ్రి అందజేశారు. కూనంనేని మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతతో పాటు ప్రజలకు ప్రాథమిక సేవలు అందిస్తున్న కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. విధుల్లో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడంతో పాటు పని ప్రదేశాల్లో భద్రత కల్పిస్తామని తెలిపారు. పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాల పెంపునకు కృషి చేస్తామని, కార్మికులకు చట్టబద్ధంగా లభించాల్సిన హక్కులు, ప్రయోజనాల అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వార్త



# అడవిలో దాగిన "అద్భుతం"..!!

పాపకొల్లు అడవుల్లో అరుదైన వృక్షజాతి 'క్రొటలేరియా వెస్టిటా'

వృక్ష వైవిధ్యానికి సహజ ప్రాంతంగా పాపకొల్లు అడవులు

నాలుగేళ్ల క్రితమే శాస్త్రీయ గుర్తింపు

193 మీటర్ల ఎత్తులో అరుదైన మొక్క

నల్ల నేలపై ' క్రొటలేరియా వెస్టిటా' గుర్తింపు

'రాసగానిగుట్ట' ప్రాంతంలో నాలుగు మొక్కల నమోదు

తెలంగాణ వృక్షశాస్త్ర చరిత్రలో కొత్త నమోదు

శాస్త్రీయ పరిశోధనలో పాపకొల్లు అటవీ ప్రాంతానికి ప్రత్యేక స్థానం

బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా-'నెలుమ్బో' జర్నల్‌లో పరిశోధన ప్రచురితం









జూలూరుపాడు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 22:

ప్రకృతి అందాలకు, విభిన్న వృక్ష సంపదకు నిలయమైన దట్టమైన పాపకొల్లు ప్రాంత అడవుల్లో అరుదైన వృక్షజాతి శాస్త్రీయ పరిశోధనలో వెలుగులోకి వచ్చింది. జూలూరుపాడు మండల పరిధిలో పాపకొల్లు అటవీ ప్రాంతంలోని "రాసగానిగుట్ట" పరిసరాల్లో 'క్రొటలేరియా వెస్టిటా' జాతికి చెందిన మొక్కలను పరిశోధకులు గుర్తించి నమోదు చేశారు. దీంతో పాపకొల్లు అడవులు వృక్ష వైవిధ్యానికి శాస్త్రీయ ప్రాధాన్యం మరింత పెరిగింది.

**నాలుగేళ్ల క్రితమే పరిశోధన..**

పాపకొల్లు అటవీ ప్రాంతంలో ఈ మొక్కలపై శాస్త్రీయ పరిశీలన నాలుగేళ్ల క్రితమే జరిగినట్లు పరిశోధనా పత్రం ద్వారా తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో మొక్కలను పరిశీలించి, వాటి ఆకులు, పుష్పాలు, కాయలు, విత్తనాలు తదితర లక్షణాలను అధ్యయనం చేశారు. అనంతరం సంబంధిత వృక్షశాస్త్ర గ్రంథాలు, గతంలో ప్రచురితమైన పరిశోధనలతో పోల్చి మొక్క జాతిని నిర్ధారించినట్లు పరిశోధనలో పేర్కొన్నారు. ఇంతేగాక ఇందుకు సంబంధించిన నమూనాలను కాకతీయ యూనివర్సిటీ వరంగల్ లోని హెర్బేరియంలో భద్రపరచినట్లు పేర్కొన్నారు.

**193 మీటర్ల ఎత్తులో..**

"రాసగానిగుట్ట" ప్రాంతంలో సముద్ర మట్టానికి సుమారు 193 మీటర్ల ఎత్తులో, నల్ల నేలతో కూడిన అటవీ ప్రాంతంలో 'క్రొటలేరియా వెస్టిటా'ను గుర్తించినట్లు పరిశోధనా వివరాలు పేర్కొంటున్నాయి. అక్కడ ఈ జాతికి చెందిన నాలుగు మొక్కలను నమోదు చేయడం ప్రత్యేకంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

**'క్రొటలేరియా వెస్టిటా' ఏమిటి?**

'క్రొటలేరియా' వృక్షజాతి పప్పుదినుసుల కుటుంబమైన ఫాబేసీకు చెందినది. ఈ జాతిలోని మొక్కలు సాధారణంగా గడ్డి లేదా చిన్న పొదల రూపంలో కనిపిస్తాయి. అయితే వివిధ 'క్రొటలేరియా' జాతులను ఖచ్చితంగా గుర్తించడానికి మొక్క ఆకృతి, పుష్ప నిర్మాణం, కాయలు, విత్తనాలు వంటి సూక్ష్మ లక్షణాలను పరిశీలించాల్సి ఉంటుంది. పాపకొల్లు ప్రాంతంలో గుర్తించిన 'క్రొటలేరియా వెస్టిటా 'ను సంబంధిత శాస్త్రీయ సాహిత్యంతో సరిపోల్చి గుర్తించడం ఈ పరిశోధనలో కీలక అంశంగా నిలిచింది.

**తెలంగాణ వృక్షశాస్త్రానికి కొత్త నమోదు**

ఒక మొక్కను కొత్త ప్రాంతంలో నమోదు చేయడం వృక్షశాస్త్ర పరిశోధనలో ముఖ్యమైన సమాచారంగా పరిగణిస్తారు. పాపకొల్లు అటవీ ప్రాంతంలో 'క్రొటలేరియా వెస్టిటా' ఉనికిని నమోదు చేయడం ద్వారా తెలంగాణలో ఈ జాతి భౌగోళిక విస్తరణపై అదనపు సమాచారం లభించినట్లయింది. అందువల్ల జూలూరుపాడు మండలంలోని పాపకొల్లు అడవులు స్థానికంగా మాత్రమే కాకుండా వృక్షశాస్త్ర పరిశోధన పరంగానూ ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**'నెలుమ్బో'లో పరిశోధన ప్రచురితం**

ఈ అరుదైన వృక్షజాతికి సంబంధించిన పరిశోధన "నెలుమ్బో" జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధనా పత్రంలో నమోదైంది. పరిశోధకులు పాపకొల్లు ప్రాంతంలో 07102021న గుర్తించిన మొక్కలను గతంలో అందుబాటులో ఉన్న వృక్షశాస్త్ర సమాచారంతో పోల్చి జాతిని నిర్ధారించారు. పరిశోధనలో "బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా ( బీఎస్ఐ)కు సంబంధించిన వృక్షశాస్త్ర సాహిత్యాన్ని కూడా ప్రామాణిక ఆధారాల్లో ఉపయోగించారు.

**వృక్ష వైవిధ్యానికి విలువైన సహజ ప్రాంతం**

పాపకొల్లు అడవుల్లో అరుదైన మొక్క శాస్త్రీయంగా నమోదు కావడం ఈ ప్రాంతంలోని జీవవైవిధ్యంపై మరింత అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. ఒక ప్రాంతంలో అరుదైన మొక్కలు కనిపించడం అక్కడి నేల స్వభావం, వాతావరణ పరిస్థితులు, అటవీ ఆవాసాల ప్రత్యేకతలను ప్రతిబింబించవచ్చు. ఇప్పటికే గుర్తించిన జాతితో పాటు పాపకొల్లు అడవుల్లో మరిన్ని అరుదైన, స్థానిక వృక్షజాతులు ఉన్నాయా అన్నదానిపై సమగ్ర వృక్ష సర్వే నిర్వహిస్తే ఈ ప్రాంత వృక్ష సంపదపై మరింత విలువైన సమాచారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**అడవిలో దాగిన అద్భుతానికి శాస్త్రీయ ముద్ర**

ఇప్పటివరకు స్థానికులకు ఒక అటవీ ప్రాంతంగా మాత్రమే కనిపించిన పాపకొల్లు.. శాస్త్రీయ పరిశోధనలోనూ తన ప్రత్యేకతను చాటుకుంది. 193 మీటర్ల ఎత్తులోని నల్ల నేలపై రాసగానిగుట్ట ప్రాంతంలో గుర్తించిన నాలుగు 'క్రొటలేరియా వెస్టిటా' మొక్కలు.. పాపకొల్లు అడవుల్లో దాగి ఉన్న వృక్ష వైవిధ్యానికి ఒక శాస్త్రీయ ఉదాహరణగా నిలిచాయి. నాలుగేళ్ల క్రితమే జరిగిన పరిశోధన ఇప్పుడు వెలుగులోకి రావడంతో ఈ ప్రాంతంపై మరింత పరిశోధన జరగాలనే ఆసక్తి నెలకొంది.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

**శాంతియుత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించాలి**

**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రకటన ద్వారా తెలిపారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా సుమారు 1,000 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. నిమజ్జన శోభాయాత్రలు జరిగే ప్రధాన మార్గాలు, నిమజ్జన ప్రదేశాలు, రద్దీ ప్రాంతాలు, సున్నితమైన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భద్రాచలం నిమజ్జనం ఘాట్ వద్ద పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు. భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఘాట్ పరిసరాల్లో పోలీస్ సిబ్బందిని అధిక సంఖ్యలో మోహరించి, రద్దీ నియంత్రణ, వాహనాల రాకపోకలు, పార్కింగ్, శోభాయాత్రల క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల మళ్లింపు, పార్కింగ్, క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. శోభాయాత్రల్లో డీజేలు, అధిక శబ్దాన్ని కలిగించే సౌండ్ సిస్టమ్స్, టపాసులకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడపడం పూర్తిగా నిషేధమని, నిమజ్జన సమయంలో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిమజ్జన ప్రదేశాల్లో గజ ఈతగాళ్లు, రెస్క్యూ సిబ్బంది, అత్యవసర సేవల బృందాలు, రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదకరమైన నీటి ప్రాంతాలను ముందుగానే గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రద్దీ ప్రాంతాల్లో బ్లూకోట్స్, మొబైల్ పెట్రోలింగ్, ట్రాఫిక్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా పోలీస్, అగ్నిమాపక, వైద్య, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని ఆదేశించారు. గణేష్ మండపాల నిర్వాహకులు, శోభాయాత్ర నిర్వాహకులు పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, శోభాయాత్ర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. గణేష్ నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ప్రజలు పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# నిఘా నీడలో వినాయక నిమజ్జనం

**- 100 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు**

**- శాంతికి విఘాతం కలిగిస్తే కటకటాలే**

**- వినాయక నిమజ్జనానికి ప్రజలు సహకరించాలి: ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్**

ఇల్లందు, సెప్టెంబర్, 22,ప్రభాతవార్త: వినాయక నిమజ్జనోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఇల్లెందు పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, నిమజ్జన మార్గాలు, రద్దీ ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సుమారు 100 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్ తెలిపారు.

**ప్రతి కదలికపై పోలీసుల నిఘా**

వినాయక విగ్రహాల శోభాయాత్ర సందర్భంగా భక్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉండటంతో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోనున్నారు. సున్నితమైన ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

**శాంతికి విఘాతం కలిగిస్తే కటకటాలే**

వినాయక నిమజ్జనం సందర్భంగా ఎలాంటి గొడవలు, ఘర్షణలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని పోలీసులు సూచించారు. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తించడం, నిబంధనలను ఉల్లంఘించడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే ఉపేక్షించబోమని సీఐ స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు, అసత్య ప్రచారాలు చేయకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ప్రజలు సహకరిస్తే నిమజ్జనం ప్రశాంతంగా**

వినాయక నిమజ్జనోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడంలో ప్రజల సహకారం ఎంతో కీలకమని సీఐ తాటిపాముల సురేష్ పేర్కొన్నారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు పోలీసుల సూచనలు పాటించాలని, నిర్ణీత మార్గాల్లోనే శోభాయాత్ర కొనసాగించాలని కోరారు. వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలకు సహకరించి ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని సూచించారు.



**యువత బాధ్యతగా వ్యవహరించాలి**

నిమజ్జనోత్సవంలో యువత అత్యుత్సాహానికి పోకుండా బాధ్యతా యుతంగా వ్యవహరించాలని పోలీసులు కోరుతున్నారు. మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొనడం, వాహనాలపై ప్రమాదకర విన్యాసాలు చేయడం, ఇతరులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. భక్తి, ఆనందోత్సాహాలతో జరిగే నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా ముగిసేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ తాటిపాముల సురేష్ విజ్ఞప్తి చేశారు.

# ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆకాంక్ష**

**పలు గణపతి మండపాల్లో ప్రత్యేక పూజలు..**

**అన్నదాన కార్యక్రమాలు ప్రారంభం..**

**ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు నిర్వహించుకోవాలని సూచన**



ఖమ్మం రూరల్ ప్రభాతవార్త

విఘ్నాలను తొలగించే ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల పరిధిలోని పలు వినాయక మండపాలను ఆయన సందర్శించారు. ఆయా మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి.. అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.పలు మండపాల్లో పూజలుఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్ వద్ద మారుతినగర్, ఖమ్మం నగరంలోని బేడ జంగాల కాలనీ, శ్రీనగర్ కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను మంత్రి సందర్శించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.ప్రశాంతంగా నిమజ్జనం చేసుకోవాలి గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లుగానే నిమజ్జన కార్యక్రమాలను కూడా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు. భక్తులందరూ సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో..: ఏదులాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోక బత్తిని అనిత, వైస్‌చైర్మన్ తమ్మినేని నవీన్, కాంగ్రెస్ పార్టీ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం, ఏదులాపురం మున్సిపాలిటీ అధ్యక్షుడు బానోత్ కిషోర్, పలువురు సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## పినపాకలో భూ రీసర్వేను పరిశీలించిన సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట



మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 22: పినపాక నియోజకవర్గంలోని బూర్గంపాడు మండలం పినపాక పట్టి నగర్, అశ్వాపురం మండలం కొమ్ముగూడెం, పినపాక మండలం సున్నంవారిగూడెం, కరకగూడెం మండలం భట్టుపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పురోగతి, హద్దుల నిర్ధారణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టా, అసైన్‌మెంట్, అటవీ భూముల హద్దులను రికార్డుల ఆధారంగా స్పష్టంగా నిర్ధారించాలని అన్నారు. అటవీ హద్దులు ఇప్పటికే ఖరారైన ప్రాంతాల్లో జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలని, శాఖల మధ్య సమన్వయంతో నెలన్నర రోజుల్లోగా రీసర్వే ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలన్నారు. భూ వివాదాలు, సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని రైతులకు తెలిపారు. అనంతరం మణుగూరు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను, వివిధ విభాగాలను పరిశీలించారు. ప్రజా సమస్యలను, ముఖ్యంగా మీసేవ సర్టిఫికెట్ల జారీని సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళల దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యమిచ్చి పరిష్కరించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, సర్వేయర్లు, రెవెన్యూ మరియు అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కూచిపూడి నృత్యంతో అలరించిన చిరంజీవి వేదజ్ఞ అదాలత్

**గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నృత్య ప్రదర్శన**

**శివ కల్యాణ మహోత్సవం..**

**భక్తులతో సందడిగా మామిళ్లగూడెం**





ఖమ్మం, ప్రభాతవార్త: ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెంలో శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 25వ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా చిరంజీవి వేదజ్ఞ అదాలత్ సమర్పించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ నృత్యరీతిలో వేదజ్ఞ అదాలత్ ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది.

గణనాథుడి సన్నిధిలో జరిగిన ఈ సాంస్కృతిక కార్యక్రమంలో వేదజ్ఞ అదాలత్ తన నృత్య ప్రతిభను చాటుకున్నారు. కూచిపూడి నృత్యంలోని హావభావాలు, లయబద్ధమైన నృత్య విన్యాసాలు, అభినయంతో ఆమె చేసిన ప్రదర్శనకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. నృత్యంలోని ప్రతి అంశాన్ని చక్కగా ఆవిష్కరిస్తూ వేదజ్ఞ ఆకట్టుకున్నారు. చిన్న వయసులోనే సంప్రదాయ కళపై ఆసక్తి, సాధనతో అద్భుతమైన ప్రదర్శన ఇవ్వడం పట్ల పలువురు అభినందించారు. ప్రదర్శన ముగిసిన అనంతరం ప్రేక్షకులు చప్పట్లతో వేదజ్ఞను అభినందించారు.

**భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు**

25వ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచే స్వామివారి ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండి తుల మంత్రోచ్చారణల మధ్య గణనాథుడికి అభిషే కాలు, ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహి ంచా రు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించు కున్నారు. దీంతో ఉత్సవ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

**వైభవంగా శివ కల్యాణం**

ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన శివ కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శివపార్వతుల కల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శివనామ స్మరణతో ఉత్సవ ప్రాంగణం మార్మోగింది. కల్యాణోత్సవాన్ని దర్శించిన భక్తులు ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు.

**భక్తులకు అన్నదానం**

శివ కల్యాణ మహోత్సవం అనంతరం శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా చిరంజీవి వేదజ్ఞ అదాలత్ కూచిపూడి నృత్య ప్రదర్శన ఉత్సవాలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చిందని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానికులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మంత్రుల పర్యటనను విజయవంతం చేయండి.

అశ్వాపురం,ప్రభాతవార్త, సెప్టెంబర్ 22:

మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నేడు మంత్రులు,ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఒరుగంటి రమేష్ బాబు పిలుపునిచ్చారు.మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తో పాటు ఇతరప్రజాప్రతినిధులు ,నాయకులు,అధికారులు హాజరుకానున్నారని తెలిపారు. ప్రాజెక్ట్ తొలిదశ పూర్తికావడంతో తుమ్మలచెరువు ఆయకట్టు రైతుల చిరకాల సాగునీటి ఆకాంక్ష నెరవేరనుందని పేర్కొన్నారు. అలాగే ప్రాజెక్ట్ మలిదశ పూర్తయితే అశ్వాపురం,జగ్గారం,మిట్టగూడెం, గొందిగూడెం, గొందిగూడెం కొత్తూరు, ఎలకలగూడెం,వెంకటాపురం, తుమ్మలచెరువు తదితర ప్రాంతాల ఆయకట్టు రైతులకు సాగునీటి ప్రయోజనం అందే అవకాశం ఉందన్నారు.సాగునీటి సౌకర్యం విస్తరించడం ద్వారా ఆయకట్టు పరిధిలోని రైతులకు వ్యవసాయ సాగు మరింత సులభతరం కావడంతో పాటు పంటల సాగుకు భరోసా కలుగుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో రైతులు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,యువత, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి మంత్రుల పర్యటనను, మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాబు కోరారు.

## విద్యుత్ సౌకర్యానికి అనుమతులు ఇవ్వాలి.

.అశ్వాపురం,ప్రభాతవార్త, సెప్టెంబర్ 22:



మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న చింతకుంట గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అటవీ శాఖ అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సర్పంచ్ మచ్చ నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డీఎఫ్ఓను కలిసి విన్నవించారు. చింతకుంట గ్రామంలో ఎన్నో ఏళ్లుగా విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు డీఎఫ్ఓ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన నిధులు ఇప్పటికే మంజూరైనందున, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసేందుకు అటవీ శాఖ పరిధిలో ఉన్న అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు.విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వస్తే చింతకుంట గ్రామ ప్రజల దీర్ఘకాల సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు విద్య, తాగునీరు, గృహ అవసరాలు తదితర మౌలిక సదుపాయాలకు మరింత వెసులుబాటు కలుగుతుందని నాయకులు పేర్కొన్నారు.గ్రామ ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకుని అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు సహకరించాలని డీఎఫ్ఓను కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తూము వీర రాఘవులు, ఆవుల రవి, బారాజు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం.

అశ్వాపురం, ప్రభాతవార్త, సెప్టెంబర్ 22:

అశ్వాపురం మండలం మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధికారులు అన్ని ఏర్పాట్లను ముమ్మరం చేశారు.ఈ నేపథ్యంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు.ఇరిగేషన్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే గొందిగూడెంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభా ప్రాంగణం, మారెళ్లపాడు డెలివరీ పాయింట్, మంత్రుల రాక కోసం సిద్ధం చేస్తున్న హెలిప్యాడ్ ప్రాంతాలను పరిశీలించారు.సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించారు.గొందిగూడెంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభా ప్రాంగణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు,రైతులు,నాయకులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు,పార్కింగ్, కుర్చీల ఏర్పాట్లు తదితర సౌకర్యాలను పకడ్బందీగా కల్పించాలని అధికారులకు సూచించారు.డెలివరీ పాయింట్ వద్ద పనుల పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం డెలివరీ పాయింట్ వద్ద జరుగుతున్న పనుల పురోగతిని ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రారంభోత్సవానికి అవసరమైన పనులన్నీ నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని,పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో మారెళ్లపాడులో సిద్ధం చేస్తున్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు.భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా హెలిప్యాడ్ ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మంత్రుల పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే,మంత్రుల కాన్వాయ్ ప్రయాణించే మార్గంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా



ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీసు,రెవెన్యూ,ఇతర శాఖల అధికారులను కోరారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి,వారికి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఒరుగంటి రమేష్ బాబు,జిల్లా ముఖ్య నాయకులు,సర్పంచులు, ఉపసర్పంచులు,వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు,యూత్ నాయకులు,కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ నగర్‌లో మహా పూజలు



మణుగూరు,ప్రభాతవార్త, సెప్టెంబర్ 22:

మణుగూరు మండలం ముత్యాలమ్మ నగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 18వ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు.అన్నారు. ఈ మహా అన్నదాన కార్యక్రమానికి వ్యవసాయ విస్తరణ అధికారి డాక్టర్ కొమరం లక్ష్మణరావు, ఉపాధ్యాయురాలు సత్యదేవి దంపతులు అన్నప్రసాద వితరణ దాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో తరుణ్ రెడ్డి, సుబ్బారెడ్డి, రామ్ మోహన్, కరుణ్ రెడ్డి, వంశీ, బబ్బు, రాజ్ గోపాల్ పాల్గొన్నారు.

## భూ రీసర్వే పనులను పరిశీలించిన సబ్ కలెక్టర్.



పినపాక, ప్రభాత వార్త, సెప్టెంబర్ 22

మండల పరిధిలోని సున్నంవారి గూడెం గ్రామ రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మంగళవారం స్వయంగా పరిశీలించారు.సర్వే పనుల పురోగతి,భూ హద్దుల నిర్ధారణ,సర్వే నంబర్లు,భూముల విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రెవెన్యూ, అసైన్‌మెంట్,అటవీ భూములు కలిసి ఉన్న ప్రాంతాల్లో రికార్డుల ఆధారంగా భూ హద్దులను స్పష్టంగా నిర్ధారించాలని అధికారులకు సూచించారు.రీసర్వే పనులను వేగవంతం చేసి నెలన్నరలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం గ్రామస్తులు, రైతులతో మాట్లాడి రీ సర్వేకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ రమేష్,రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్యాంసుందర్, సర్వేయర్ నరేష్, జిపిఓలు,రెవెన్యూ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.




## కరాటే మాస్టర్స్‌కు అభినందనలు

మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 22:



మణుగూరుకు చెందిన కరాటే మాస్టర్లు గ్లోబల్ స్థాయిలో ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకోవడం పట్ల పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేస్తూ వారికి అభినందనలు తెలిపారు. మంగళవారం మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీనియర్ కరాటే మాస్టర్ కాసిమల్ల పద్మ, గుగులోత్ రిషికలు ఎమ్మెల్యే వెంకటేశ్వర్లును కలిశారు. బ్లాక్ బెల్ట్ 4వ డాన్ విభాగంలో కాసిమల్ల పద్మ గ్లోబల్ మాస్టర్ అవార్డు సాధించగా,బ్లాక్ బెల్ట్ 1వ డాన్ విభాగంలో గుగులోత్ రిషిక గ్లోబల్ స్టార్ కిడ్ అవార్డు అందుకున్నారు.ఈ సందర్భంగా వారిద్దరినీ ఎమ్మెల్యే పాయం శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## సింగరేణి హెల్త్ క్యాంప్



మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 22:

సింగరేణి సేవా సమితి, వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మంగళవారం దమ్మక్కపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.సింగరేణి యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరంలో 84 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.సాధారణ వ్యాధులతో పాటు బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు, సీజనల్ వ్యాధుల నివారణకు పాఠశాల పిల్లలకు అవసరమైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి వైద్యులు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ స్పందన, ఏరియా హాస్పిటల్ సిబ్బంది యు. భవాని, బి. నాగమణి, సేవా సమితి కోఆర్డినేటర్ మారేశ్వరరావు, గ్రామ సర్పంచ్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్ష నాయకుడిపై పోలీసుల దాడి దుర్మార్గం : మాజీ ఎమ్మెల్యే రేగా

మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 22

:వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి వద్ద మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు వినయ్ భాస్కర్ పై పోలీసులు జరిపిన దాడిని పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తీవ్రంగా ఖండించారు. ఆయన మంగళవారం మణుగూరులో విలేకరులతో మాట్లాడారు. రోగులను పరామర్శించి, ఆసుపత్రి దుస్థితిని పరిశీలించడానికి వెళ్లిన ప్రతిపక్ష నాయకుడిపై పోలీసులు రౌడీల్లా వ్యవహరించడం దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, పాలన చేతగాక ప్రశ్నించే ప్రతిపక్షాలపై దాడులు చేయిస్తున్నారని విమర్శించారు.ఈ దాడికి పాల్పడిన పోలీసులపై ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం అక్రమ కేసులు, దాడులకు పాల్పడుతోందని, ఇవే ఈ ప్రభుత్వ పతనానికి నాంది అని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి నీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, ధైర్యముంటే ఆరోగ్య హామీలను అమలు చేయ అని సవాలు విసిరారు. రేపు వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని, అక్రమాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ నేతలు, చెంచాగిరి చేస్తున్న పోలీసులు వదిలెట్లు మూల్యం చెల్లించుకోక తప్పదని రేగా హెచ్చరించారు.అణచివేయాలని చూస్తే రెట్టింపు ఉత్సాహంతో పోరాడతామని ఆయన తెలిపారు.




# దమ్మపేట ఏజెన్సీలో అక్రమ నర్సరీల జోరు

**గుల్లవుతున్న ప్రకృతి సంపద, ఎర్ర మట్టి దందాతో తీవ్ర పర్యావరణ విఘాతం! ఎర్రమట్టి "తోడేళ్ళు" నిద్రావస్థలో అధికార యంత్రాంగం**





దమ్మపేట, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త: దమ్మపేట మండలంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార నర్సరీల నిర్వహణ విపరీతంగా పెరిగిపోతోంది. గిరిజనుల చట్టబద్ధమైన హక్కులను కాపాడాల్సిన ఏజెన్సీ ప్రాంతంలో చట్టాలను తుంగలో తొక్కుతూ గిరిజనేతరుల హవా కొనసాగుతుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏజెన్సీ నిబంధనలు ఇక్కడ కేవలం కాగితాలకే పరిమితమయ్యాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎర్ర మట్టి దందా పర్యావరణానికి విఘాతం: నర్సరీల పేరుతో మండలంలో భారీ ఎత్తున ఎర్ర మట్టి తోలకాలు సాగుతున్నాయి. ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా గుట్టలు, అసైన్డ్ భూములు, గిరిజన భూముల నుండి విచ్చలవిడిగా ఎర్ర మట్టిని తవ్వి రవాణా చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పగలు లేదు, రాత్రిఅని తేడా లేకుండా 24 గంటలు ఎర్రమట్టిని విచ్చలవిడిగా తోడేస్తున్నారే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. అయితే అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నర్సరీ నిర్వాహకులు ఈ మట్టిని అక్రమంగా తరలిస్తూ లక్షలాది రూపాయల వ్యాపారం చేస్తున్నారు. గిరిజనుల అమాయకత్వాన్ని, ఆర్థిక బలహీనతలను ఆసరాగా చేసుకుని, లీజుల పేరుతోనూ, అక్రమ ఒప్పందాల ద్వారా గిరిజనేతరులు భూములను ఆక్రమించి భారీ ఎత్తున నర్సరీలను ఏర్పాటు చేస్తున్నారు. ఏజెన్సీ చట్టాలను తీవ్రంగా ఉల్లంఘిస్తూ, ప్రకృతి సంపదను గుల్ల చేస్తున్న అక్రమ నర్సరీలపై, ఎర్ర మట్టి రవాణాదారులపై రెవెన్యూ, ఐటీడీఏ, అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి విచారణ జరపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మధ్యాహ్నభోజన కార్మికుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



దమ్మపేట, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త: మధ్యాహ్న భోజనం కార్మికుల పెండింగ్ వేతనాలు, వంట బిల్లులు, గుడ్లు బిల్లులు నెలలు తరబడి విడుదల చేయకపోవడం ప్రభుత్వ అలసత్వానికి నిదర్శనమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ అన్నారు. మధ్యాహ్నం భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సిబ్బంది నాగేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం ఉండటం లేదని అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే సందర్భంలో హైదరాబాద్ ఇంద్ర పార్క్ ధర్నాకు వెళ్తుంటే కార్మికుల నాయకుల ఇండ్లపై పడి అరెస్టులు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశత్వ స్వభావాన్ని చాటుకుంటుందని అన్నారు. పెరుగుతున్న ధరలకు తగ్గట్టుగా పాఠశాలల వంట మెనూ అమలు చేయాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారని కానీ సకాలంలో వండిన బిల్లులు రాక అనేక యాతనలు అనుభవిస్తున్నారని అన్నారు. మధ్యాహ్న భోజనం వంట కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం మేరకు రూ.10వేల వేతనం పెంచాలని, గ్యాస్, కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మురహరి రఘు,సత్యవతి, శ్రీదేవి, ఈశ్వరమ్మ, జయ, రాములమ్మ, విక్రమ్ పాల్గొన్నారు.

## మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు ముగింపు





కల్లూరు, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త

కల్లూరు పీఎం శ్రీ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన కల్లూరు మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు మంగళవారం ఘనంగా ముగిశాయి. మండల పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన మొత్తం 1,034 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ విభాగాల్లో జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. అత్యధిక విభాగాల్లో విజయాలు సాధించిన పీఎం శ్రీ హైస్కూల్, కల్లూరు మండల స్థాయి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. వాలీబాల్ ఫలితాలు… అండర్14 బాలురు: విజేత – విజ్ఞాన్ స్కూల్, కల్లూరు రన్నరప్ – జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నూరు అండర్17 బాలురు: విజేత – పీఎం శ్రీ హైస్కూల్, కల్లూరు రన్నరప్ – జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చంద్రువ ట్లఅండర్14 బాలికలు: విజేత – పీఎం శ్రీ హైస్కూల్, కల్లూరు రన్నరప్ – జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నూరు అండర్17 బాలికలు: విజేత – ఆశ్రమ గర్ల్స్ హైస్కూల్, కల్లూరు రన్నరప్ – పీఎం శ్రీ హైస్కూల్, కల్లూరు ఖోఖో ఫలితాలు… అండర్14 బాలురు: విజేత – జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నూరు రన్నరప్ – పీఎం శ్రీ హైస్కూల్, కల్లూరు అండర్17 బాలురు: విజేత – ప్రతిభ హైస్కూల్, కల్లూరు రన్నరప్ – పీఎం శ్రీ హైస్కూల్, కల్లూరు అండర్14 బాలికలు: విజేత – తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కల్లూరు రన్నరప్ – జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నూరు అండర్17 బాలికలు: విజేత – తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కల్లూరు రన్నరప్ – జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెరుకూరు కబడ్డీ ఫలితాలు.. అండర్14 బాలురు: విజేత – తెలంగాణ గ్లామర్ స్కూల్, కల్లూరు రన్నరప్ – పీఎం శ్రీ హైస్కూల్, కల్లూరు అండర్17 బాలురు: విజేత – జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిన్నకోరుకొండి రన్నరప్ – జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నూరు అండర్17 బాలికలు: విజేత – జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పేరువం చరన్నరప్ – తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కల్లూరు. క్రీడాకారులకు ప్రత్యేక వసతులు.. పోటీల్లో పాల్గొన్న 1,034 మంది క్రీడాకారులకు తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ మెంబర్ పెండకంటి రామకృష్ణ ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు. క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంపై నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పసుపులేటి వీరరాఘవయ్యతో పాటు నిర్వాహకులు పాల్గొని విజేతలకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు తదుపరి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి కల్లూరు మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## దమ్మపేట రెవెన్యూ కార్యాలయంలో దళారుల బారిన పడొద్దు: తహసీల్దార్ మద్దినేని మురళి హెచ్చరిక

దమ్మపేట, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:




దమ్మపేట మండల రెవెన్యూ కార్యాలయంలో దళారీ వ్యవస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, రైతులు భూ హక్కుదారులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ), దమ్మపేట తహసీల్దార్ మద్దినేని మురళి స్పష్టం చేశారు. మండలంలో దళారులు తిరిగి తమ కార్యకలాపాలను సాగిస్తున్నారనే వదంతులపై ఆయన తీవ్రంగా స్పందిస్తూ హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుత తహసీల్దార్ పదవి కొంతకాలమే ఉంటుందని, తిరిగి తమకు అనుకూలమైన వారే వస్తారని దళారులు ప్రచారం చేస్తూ రైతులనునమ్మించే యత్నం చేస్తున్నారని, అలాంటి దుష్ప్రచారాలను రైతులు అస్సలు నమ్మవద్దని సూచించారు. భూ బదిలీలు, పట్టాదార్ పాస్ పుస్తకాల జారీ, ఇతర భూవ్యవహారాలన్నీ పూర్తిగా రెవెన్యూ చట్టాలు, ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాత్రమే జరుగుతాయని తేల్చిచెప్పారు."పట్టా పుస్తకాలు ఇప్పిస్తాం.. భూ సమస్యలు పరిష్కరిస్తాం" అంటూ ప్రలోభపెట్టే దళారుల మాటలు నమ్మవద్దని, అలాంటి వారిపై వెంటనే దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో గానీ, స్థానిక పోలీస్ స్టేషన్‌లో గానీ ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వకార్యాలయాల్లో దళారీ వ్యవస్థను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని, దళారుల కదలికలు, కార్యకలాపాలపై ఇప్పటికే ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు, భూ హక్కుదారులు అప్రమత్తంగా ఉండి దళారుల బారిన పడకుండా, భూ వ్యవహారాల్లో కేవలం చట్టబద్ధమైన విధానాలనే అనుసరించాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు.

## రెడ్యాల పాడులో గణపతి నిమజ్జనం

దమ్మపేట రూరల్ సెప్టెంబర్ 22 ప్రభాతవార్త



:గండుగులపల్లి పంచాయతీ పరిధిలోని రెడ్యాల పాడు గ్రామంలో వినాయక చవితి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గణనాథునికి ప్రజలు నిత్య పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం గణపతిని గ్రామంలో ఊరేగింపుగా నిమజ్జనానికి బయలుదేర తీశారు. గణపతి లడ్డు వేలం పాటలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్కంఠ భరితంగా సాగిన లడ్డు వేలం పాటలో ఊకే రవి రూ : 40,116లకు గణపతి లడ్డూ దక్కించుకున్నారు. దీనితో గ్రామ ప్రజల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మెచ్చు వీరప్ప, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 12వ జాతీయ గోండి భాషా వర్క్‌షాప్ కరపత్రాన్ని ఆవిష్కరించిన జారె



అశ్వారావుపేట రూరల్, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో 12వ జాతీయ గోండి (కోయ) భాషా ప్రామాణీకరణవర్క్ షాప్ కరపత్రాన్ని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే కోరం కనకయ్యలతో కలిసి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె మాట్లాడుతూ ప్రాచీన సంస్కృతి విశిష్టమైన చరిత్ర కలిగిన గోండి (కోయ) భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో గోండి (కోయ) భాషను చేర్చడమే లక్ష్యంగా భాష ప్రామాణీకరణ కోసం భద్రాచలం ఐటీడీఏ గిరిజన భవన్‌లో అక్టోబర్ 2 నుండి 6 వరకు జాతీయ స్థాయి వర్క్ షాప్ నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కోయ భాష పురోగతికి దిక్సూచి రూపకల్పనకు భాషా సాంస్కృతిక విశిష్టతను భావితరాలకు అందించడానికి ఇటువంటి జాతీయ వర్క్ షాప్‌లు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు భాషాపరిరక్షణకు ప్రజాప్రతినిధులుగా తమ వంతు సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల ప్రతినిధులు భాషాభిమానులు మేధావులు ఈ 5 రోజుల వర్క్ షాప్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.




# గణపతి ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి, డాక్టర్ మట్ట...

**సత్తుపల్లి సెప్టెంబర్ 22 ప్రభాతవార్త**

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సత్తుపల్లి మున్సిపాలిటీలో నిర్వాహకులు ఏర్పాటుచేసిన మండపాల్లో గణనాథులు కొలువై ప్రత్యేక పూజలుఅందుకుంటున్నారు. ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభమైన ఉత్సవాలు మంగళవారంతో తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని జవహర్ నగర్ కృష్ణుడి గుడి వద్ద , జూపల్లి కంటి ఆసుపత్రి రోడ్లో, పట్టణంలోని కోదండరామ ఆలయంలో, జేవియర్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన శ్రీ ప్రసన్న గణపతి ఉత్సవాల్లో రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ , సమాచారశాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్లు పాల్గొన గా వారికి నిర్వాహకులు సాదరంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మంత్రి పొంగులేటి, డాక్టర్ మట్టా దయానంద్ లను ఉత్సవ కమిటీ నిర్వాహకులు శాలువాలతో





ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ, రాష్ట్ర ప్రజలు, సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో అన్ని విధాలుగా సంతోషంగా ఉండాలని వేడుకున్నారు. అనంతరం ఆయా మండపాలలో ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేసిన మహా అన్న ప్రసాదాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్లు ప్రారంభించి, భక్తులకు స్వయంగా వడ్డించారు. వారి వెంట మున్సిపల్ చైర్ పర్సన్ మహమ్మద్ రెహనా కమల్ పాషా, సత్తుపల్లి, కల్లూరు,ఏఎంసీ చైర్మన్లు దోమ ఆనంద్ బాబు, భాగం నీరజ చౌదరి, కౌన్సిలర్లు తోట సుజలా రాణి, మందపాటి ప్రభాకర్ రెడ్డి, వీరివాడ అపర్ణ నాగభూషణం, దూదిపాల రాంబాబు, గ్రాండ్ మోలాలి, బండారు శరత్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, కాంగ్రెస్ నాయకులు కొత్తూరు ప్రభాకర్ రావు , మొరిశెట్టి సాంబశివరావు, మహమ్మద్ కమల్ పాషా, నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు,ప్రజాప్రతినిధులు,పై గణేష్ మండపాల ఉత్సవ కమిటీ నిర్వాహకులు హాజరైన వారిలో ఉన్నారు.

# సత్తుపల్లిలో వెల్నెస్ సెంటర్ ఏర్పాటు చేయండి...



**సత్తుపల్లి సెప్టెంబర్ 22 ప్రభాతవా ర్త**

నియోజక వర్గకేంద్రమైన సత్తుపల్లిలోఉపాధ్యాయులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం కోరకు వెల్నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కితెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు వినతిపత్రం అందచేశారు.మంగళవారం సత్తుపల్లి పర్యటన వచ్చిన మంత్రి పొంగులేటి నీ విశ్రాంత ఉద్యోగులు కలుసుకొని జిల్లా కేంద్రం ఖమ్మంలో ఉన్న వెల్నెస్ సెంటర్ దూరంగా ఉందని, సత్తుపల్లిలోసెంటర్ఏర్పాటు చేస్తే వేలాదిమందికి ఉపయోగ కారంగా ఉంటుందని వారు వినతి పత్రంలోపేర్కొన్నారు.దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకొని యాభై శాతం పిట్మెంట్ మంజూరు చేయాలని కోరారు. ఆరు డీఏల మంజూరు,రిటైర్ అయినఉద్యోగులబకాయిల చెల్లింపు, సిపిఎస్ ను యూపీఎస్గమార్పు చేయాలని కోరారు.తప్పకుండా సమస్యల పరిష్కారంకు తన వంతు కృషి చేస్తానని మంత్రిహామీఇచ్చారు.వినతిపత్రం అందచేసిన వారిలో సంఘ అధ్యక్ష,కార్యదర్శులు కేశవరెడ్డి ,ప్రకాశరావు ,మధుసూదనరాజు, కమల కుమారి తదితరులు ఉన్నారు.

# ఆయుర్వేదంపై అవగాహన కార్యక్రమాలు....

**సత్తుపల్లి సెప్టెంబర్ 22 ప్రభాత వా ర్త 11**

వ అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని డిపార్ట్మెంట్ ఆఫ్ ఆయుష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ యునాని వైద్యశాల, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సంయుక్తంగా మంగళవారం పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సెప్టెంబర్ 21న మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు, అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారం,



సమతుల్య ఆహారం ప్రాముఖ్యతపై యునాని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేందర్, ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షీలా స్రవంతి అవగాహన కల్పించారు. సెప్టెంబర్ 22న ఆరోగ్య పరిరక్షణలో యోగా ప్రాధాన్యతనుతెలియజేస్తూ యోగ వాక్ నిర్వహించారు. ప్రజలు సాంప్రదాయ వైద్య విధానాలతో పాటు యోగ ఆరోగ్యకరమైన ఆహారం పరిశుభ్రతను తమ దయనందిన జీవితంలో భాగం చేసుకోవాలని వారు సూచించారు. ఈకార్యక్రమంలోఫార్మసిస్టులు సంతోష్ కుమార్, కె. శ్రీనివాసరావు, యోగా ఇన్స్ట్రక్టర్ శాంతి, ఎస్ఎన్ఓ ప్రవీణ్ కుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి సివిల్ ఎస్ఈ రవికుమార్ కు పదోన్నతి...

## . శ్రీరామ్ పూర్ ఏరియా హెచ్ ఓ డి గా వెళ్లిన రవికుమార్.

**.. సత్తుపల్లి సెప్టెంబర్ 22 ప్రభాతవార్త**



సత్తుపల్లి సింగరేణి ఏరియాలోని సివిల్ ఎస్ ఈ గా విధులు నిర్వహిస్తున్న ఏ రవికుమార్ కు సింగరేణి సంస్థ పదోన్నతి కల్పిస్తూ శ్రీరాంపూర్ ఏరియా హెచ్ ఓ డి గా ఆదేశాలు జారీ చేసింది. సత్తుపల్లి సింగరేణిలో రెండున్నర సంవత్సరాల పాటు విధులు నిర్వహించిన రవికుమార్ సివిల్ ఇంజనీరింగ్ భాగంలో సింగరేణి ప్రభావిత గ్రామాలలో కోట్లాది రూపాయలు విలువైనసిఎస్ఆర్ నిధులతో కమ్యూనిటీ భవనాలు నిర్మాణాలు, గో డాన్స్, సిసి రోడ్లు, సైడ్ కాలవలు, తదితర ఎన్నో నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసి అందించి ఉన్నతాధికారులు దృష్టిలో రవికుమార్ గుర్తింపు పొందారు. సంస్థ అప్పజెప్పిన వివిధ రకాల సివిల్ నిర్మాణ పనులు పూర్తి చేయించడం లో కిందిస్థాయి ఉద్యోగులతో అన్యోన్యంగా ఉంటూ, కాంట్రాక్టర్లతో సైతం అధికారిగా కాకుండా ఓసోదరభావంతో వినయంగా ఉంటూ తన పనులు సకాలంలో పూర్తిచేసుకుని పేరు తెచ్చుకున్నారు.కింది స్థాయి ఉద్యోగులు తో పాటు ఉన్నతస్థాయి అధికారులు సైతం పనితీరును మెచ్చుకొని సింగరేణి యాజమాన్యం పదోన్నతి పై శ్రీరాంపూర్ ఏరియా కు సివిల్ విభాగం హెచ్ ఓడి గానియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో సత్తుపల్లి నుంచి రవికు మార్ శ్రీరాంపూర్ రిలీవ్ అయ్యారు. తక్కువ కాల పని చేసినప్పటికీ సింగరే ణిలో మంచి ఉద్యోగిగా రవికుమార్ పేరు తెచ్చుకొని హెచ్ ఓ డి గాపదోన్నతి పై శ్రీరాంపురం ఏరియా వెళ్ళటం పట్ల పలువురు హర్షిస్తున్నారు.

# గణపతి మండపాల్లో ప్రత్యేక పూజలు



**వేంసూర్,సెప్టెంబర్ 22,ప్రభాతవార్త.**

వేంసూరు మేజర్ గ్రామంతో పాటు తల్లాడ మండలంలోని నూతనకల్,మిట్టపల్లి, బిల్లుపాడు గ్రామాల్లో వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన పలు గణపతి మండపాలను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ సందర్శించారు. ఆయా గణపతి మండపాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.అనంతరం అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.ఈ కార్యక్రమాల్లో వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర్ల.చంద్రశేఖర్ రెడ్డి,ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల సోమిరెడ్డి,గ్రామ సర్పంచ్ ఫక్రుద్దీన్, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెలమ కులాన్ని దూషించిన ఎమ్మెల్యే పై చర్యలు తీసుకోండి:దామోర

**సత్తుపల్లి సెప్టెంబర్ 22 ప్రభాతవార్త**



వెలమకులస్తుల పై నోరు పారేసుకుని దూషించిన షాద్నగర్ ఎమ్మెల్యే వీరవల్లి శంకర్ పై చర్యలు తీర్చుకోవాలని జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి, సత్తుపల్లి వెలమ సంఘం అధ్యక్షుడు దామెరరమేష్ మంగళవారం ఓ ప్రకటన లో డిమాండ్ చేశారు. వెలమ కులానికి చెందిన ఎమ్మెల్యేలు ఆరుగురు అధికార కాంగ్రెస్ పార్టీలో ఉన్నారని, వీరితోపాటు పార్టీలో ప్రముఖ నాయకులు, అదేవిధంగా ఇతర పార్టీల్లో కూడా వెలమ కులానికి చెందిన ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు ఎంతో మంది ఉన్నారని ఈ విధంగా ఒక కులాన్ని పట్టుకొని ప్రత్యేకంగా దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, గతంలో కూడా ఈ ఎమ్మెల్యే ఇదే విధంగా వెలమ కులస్తులపై దూషించడం జరిగిందని ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ఆ ఎమ్మెల్యే పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని రమేష్ కాంగ్రెస్ అధిష్టాన వర్గాన్ని కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉండి ఆ ఎమ్మెల్యే ఈ విధంగా మాట్లాడటం వెలమ కులస్తుల మనోభావాలు దెబ్బ తినే విధంగా ఉన్నాయని కాంగ్రెస్ పార్టీకి ఆ కులస్తుల నుండి నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని రమేష్ అనుమానం వ్యక్తం చేశారు.



# భగత్ సింగ్ జయంతి సభ...

**సత్తుపల్లి సెప్టెంబర్ 22 ప్రభాత వా ర్త**

విప్లవ వీరుడు షాహిద్ భగత్ సింగ్ 119 వ జయంతి వేడుకను సత్తుపల్లి నీలం రామచంద్రయ్య భవన్లో మంగళవారం పిడిఎస్ యు, పివైఎల్ , పివో డబ్ల్యూ, జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన పిఒడబ్ల్యూ రాష్ట్ర కోశాధికారి ఝాన్సీ, పి వై జిల్లా సహాయ కార్యదర్శి సంఘం అరుణ్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తూ, ఆధిపత్యాన్ని చెలాయిస్తున్న అమెరికా యుద్ధోన్మాద విధానాలను తీవ్రంగా నిరసించారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కాపాడబడాలంటే ప్రజల ఐక్య పోరాటాలను బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. భగత్ సింగ్ కేవలం బ్రిటిష్ పాలనపైనే కాకుండా దోపిడీ లేని సమాజంకోసం,సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. ఆయన చూపిన ధైర్యం, త్యాగం, సామాజిక మార్పు స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

అలాగే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ, ఫాసిస్ట్ వైఖరికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య శక్తులు ఏకమై ఫాసిజాన్ని తరిమికొట్టాలని కోరారు. రోజురోజుకూ పెరుగుతున్న మహిళలపై లైంగిక దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా మహిళా లోకం చైతన్యవంతమైపోరాడాలని ఉద్ఘాటించారు. యువత జీవితాలను, భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల సంస్కృతికి వ్యతిరేకంగా విద్యార్థి, యువజన లోకం సమరశీల పోరాటాలు నిర్వహించాలనిపిలుపునిచ్చారు.

# ఆదివాసీల గుడిసెల జోలికి రావద్దు

### దేవస్థానం అధికారుల దూకుడు తగ్గించాలి: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్




భద్రాచలం, సెప్టెంబర్ 22(ప్రభాతవార్త) దమ్మక్కగూడెం, సమ్మక్క కాలనీల్లో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనుల ఇళ్లను తొలగించే ప్రయత్నాలను విరమించుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆదివాసీ గిరిజనులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ నాయకులు దాసరి సాయన్న, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మునిగేల శివప్రశాంత్, ఆదివాసీ మహిళా సంఘం నాయకురాలు సావిత్రి మాట్లాడుతూ దమ్మక్కగూడెంలో ఎన్నో ఏళ్లుగా ఆదివాసీలు నివాసం ఉంటున్నారని తెలిపారు. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్న పేదలపై అధికారులు చర్యలకు దిగడం సరికాదన్నారు. భూముల ఆక్రమణలపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి, పేద ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరారు. ఇంటి స్థలం లేని గిరిజనులు, గిరిజనేతర పేదలకు ఐదు సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేయాలని ఐటీడీఏ పీవోను డిమాండ్ చేశారు. కాలనీలకు రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. దేవస్థానం అధికారులు ఇతరుల మాటలు విని ఆదివాసీలపై చర్యలు తీసుకోవద్దని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో రాజీ, సమ్మక్క, దుర్గ, శాంత, రూపిణి, ఆదిలక్ష్మి, కృ. మల్లయ్య, ప్రణయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై హాస్టల్ విద్యార్థులకు అవగాహన



బయ్యారం, ప్రభాతవార్త, సెప్టెంబర్ 22: బయ్యారం మండలం జగ్గుతండ ప్రభుత్వ గిరిజన సంక్షేమ హాస్టల్‌లో మండల వైద్యాధికారి డాక్టర్ విజయకుమార్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారి, సర్పంచ్ అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రభుత్వం అందించిన బ్యాగులు, షూస్, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు.

తర్వాత విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఓ బుగ్గ రామయ్య, వార్డెన్ తిరుమలరావు, ఏఎన్ఎంలు పార్వతి, సమ్మక్క, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

### వెనుక కూర్చున్న వ్యక్తికి గాయాలు కేసు నమోదు

బూర్గంపహాడ్, ప్రభాతవార్త: బూర్గంపహాడ్ మండల పరిధిలోని లక్ష్మీపురంలో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై మేడా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మురిమడుగు గ్రామానికి చెందిన గద్దం సత్యం (55) మోటార్‌సైకిల్‌పై పవన్‌కుమార్‌ను వెనుక కూర్చోబెట్టుకుని లక్ష్మీపురం వైపు వెళ్తుండగా నయారా బంకు వద్ద మధ్యాహ్నం సమయంలో ఎదురుగా వచ్చిన లారీ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడుపుతూ సత్యం ప్రయాణిస్తున్న మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో సత్యం లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న పవన్‌కుమార్‌కు గాయాలయ్యాయి. మృతుడి కుమారుడు గద్దం ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## బయ్యారం పెద్ద చెరువు నీటి విడుదల కోసం రైతుల రాస్తారోకో

### 15 రోజుల్లో నీళ్లివ్వకపోతే తూములు బద్దలు కొడతామని రైతుల హెచ్చరిక

బయ్యారం, ప్రభాతవార్త, సెప్టెంబర్ 22: బయ్యారం పెద్ద చెరువు నుంచి పంటలకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన రాస్తారోకో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు రహదారిపై బైఠాయించారు. 15 రోజుల్లోగా పంటలకు నీటిని విడుదల చేయకపోతే తూములు బద్దలు కొట్టి నీటిని పారించుకుంటామని అధికారులను రైతులు హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ సప్పిడి నాగరాజు, సీఐ రవీందర్, ఎస్ఐ ప్రశాంత్ బాబు, ఇరిగేషన్ ఏఈ పృథ్వీలు రైతులతో చర్చలు జరిపి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రెండు రోజుల్లో నీటి విడుదలపై క్లారిటీ ఇస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

# వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి



### రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

భద్రాచలం, ప్రభాతవార్త: వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు భద్రాచలం పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం పట్టణ పరిధిలోని రౌడీషీటర్లను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. పండుగ సమయంలో ఎలాంటి గొడవలు, ఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించవద్దని స్పష్టం చేశారు. వినాయక నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా నిర్వహించుకోవాలని భద్రాచలం డీఎస్పీ ఎం. అరుణ్‌కుమార్ కోరారు. నిమజ్జన ఊరేగింపులో మద్యం సేవించి పాల్గొనవద్దని సూచించారు. అలాగే డీజేలు వినియోగించరాదని స్పష్టం చేశారు. పండుగ సందర్భంగా పోలీసులకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని డీఎస్పీ కోరారు.

## విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి

భద్రాచలం క్రైమ్ ,ప్రభాత్‌వార్త: 23, 09, 2026 బుధవారం రోజున ఉదయం 0900 గంటల నుండి మధ్యాహ్నం 0200 గంటల వరకు భద్రాచలం గోదావరిలో నిమజ్జనానికి వచ్చే గణనాథులకు రోడ్డు క్రాసింగ్ తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను హైట్ పోల్స్ వేయుట కారణంగా అంతరాయం కలుగును. విద్యుత్ అంతరాయం కలుగు ప్రాంతములు కూనవరం రోడ్డులో ఐటీసీ కోటర్స్ నుండి శివమందిర్ వరకు, ఎన్టీఆర్ స్టాచ్యూ ఆపోజిట్ లైన్స్ , సుభాష్ నగర్ కాలనీ, ఐటీసీ కోటర్స్, శ్రీ విద్యా స్కూల్ లైన్, ఈ ప్రాంతములలో విద్యుత్ అంతరాయము కలుగును . కావున విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా కోరుచున్నాము.

## పిల్లల విద్యను ప్రోత్సహించడమే లక్ష్యం



గార్ల, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త: పిల్లల విద్యకు సంబంధించిన అవసరాలను గుర్తించి సహకరిస్తు చిన్నారులను విద్యాభివృద్ధిలో ముందడుగు వేయాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పూర్వ విద్యార్థులు రున్‌వాల్ వీరన్న, రున్‌వాల్ రాజేష్, రున్‌వాల్ రమేష్ తెలిపారు. మండల కేంద్రంలోని సమత హై స్కూల్‌లో 2007 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు మంగళవారం మండల పరిధి మర్రిగూడెం, చెవిటి తండా, రాంపురం, పుల్లూరు గ్రామంలోని ఏడు అంగన్వాడి కేంద్రాలను వారు సందర్శించి పిల్లలకు పలకలు, బలపాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు చిన్నారులు చదువుపై ఆసక్తి పెంచు కోవడంతో పాటు, విద్యలో ముందుకు సాగేందుకు అవసరమైన ప్రోత్సాహం అందించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని వారు కోరారు. అంగన్వాడి సిబ్బంది, గ్రామస్తులు పూర్వ విద్యార్థు లను అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రున్ వాల్ వీరన్న. రాజేష్, రమేష్, పుల్లూరు. అంగన్వాడి టీచర్లు ఉపేంద్రమ్మ, సునీత, పార్వతి, ఆయాలు రుక్మిణి, శాంతమ్మ, మర్రిగూడెం అంగన్వాడి టీచర్ స్వరూప ఆయా అనసూర్య, చెవిటి తండా అంగన్వాడి టీచర్ సీత, పుల్లూరు హై స్కూల్ ప్రధానో పాధ్యాయులు రాంబాబు, గ్రామస్తులు ఫుల్ సింగ్, భూక్యా హరి, అన్నం శ్రీనివాసరావు, ఆకాశ ట్రస్ట్ ఖమ్మం వెంకటేశ్వరరావు, కవి రచయిత విశ్రాంత ఉపాధ్యాయులు పంజాల ఐలయ్య, రాంపురం ప్రధానోపాధ్యాయులు నిర్మల, అంగన్వాడి టీచర్ లక్ష్మి, గ్రామస్తులు శ్రీను, రోజా, అనూష, నవ్య, ప్రవీణ్, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ అవసరాల సర్వేలో నిరుద్యోగులు పేరు నమోదు చేసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త: మహబూబాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువత ఉద్యోగ అవసరాల సర్వేలో తమ పేరు నమోదు చేసుకోవాలని సంబంధిత శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాల మేరకు జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతకు సంబంధించిన ఉద్యోగ అవసరాలు, ఉద్యోగ రంగాలు, విద్యార్హతలు, వేతన ప్రాధాన్యతలు, ఉద్యోగ ప్రదేశం తదితర అంశాలను తెలుసుకునేందుకు జాబ్ రిక్రూట్‌మెంట్ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా జిల్లాలోని యువతకు అవసరమైన ఉద్యోగ అవకాశాలు, శిక్షణ కార్యక్రమాలు, రాబోయే ఉద్యోగ మేళాలో మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సమాచారాన్ని సేకరించనున్నారు. మహబూబాబాద్ జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలకు చెందిన నిరుద్యోగ యువత ఈ సర్వేలో తప్పనిసరిగా పాల్గొని, తమ ఉద్యోగ అవసరాలు ప్రాధాన్యతలను నమోదు చేసుకోవాలని అధికారులు కోరారు. పూర్తి వివరాలకు జిల్లా ఉపాధి అధికారి రజిత ఫోన్ నెంబర్:9866142287, జనరల్ మేనేజర్ 9398327435, డిపిఆర్‌వో 9908152878 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.